ప్రజాశక్తి

శనివారం 15 నవంబర్ 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు



- రబీలో సాగు చేయొద్దని ఆంక్షలు
- నిండుకుండల్లా సాగర్, పులిచింతల
- అయినా కరుణించని ప్రభుత్వం

నీరున్నా.. వరికి నో..!

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నాగార్జున సాగర్, పులిచింతల జలాశయాలు నిండుకుండల్లా ఉన్నా సాగునీటి వినియోగంపై అధికారులు ఆంక్షలు విధిస్తున్నారు. కృష్ణా డెల్టాలో రబీ సీజన్‌లో వరికి నీరు ఇవ్వలేమని ఈ ఏడాది ఆరుతడి పంటలే వేసుకోవాలని జలవనరుల శాఖ అధికారులు శుక్రవారం ప్రకటించారు. కేవలం ఆరుతడి పంటలు అంటే డెల్టాలో జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర, శనగ పంటలు మాత్రమే సాగు చేయాల్సి ఉందని అధికార వర్గాలు తెలిపాయి. జిల్లాలో 1.45 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1.42 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. జులై, ఆగస్టులో కురిసిన అధిక వర్షాల వల్ల వెదపద్ధతిలో సాగు చేసిన 70 వేల ఎకరాల్లో వరి పైర్లు దెబ్బతిన్నాయి. దీంతో ఈ ఏడాది రెండో పంటగా వరి సాగుకు కొంత మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. తక్కువ కాలంలోసాగు చేసే వంగడాలను వేయాలని యోచిస్తున్నారు. అయితే ప్రభుత్వం ఇందుకు అంగీకరించడం లేదు. నీటి నిల్వలున్నా పంటలకు ఆంక్షలు చేయడం సర్వత్రా చర్చ నీయాంశమైంది.

శ్రీశైలం జలాశయంలో గరిష్ట నీటి నిల్వ 215.82 టిఎంసిలు కాగా శుక్రవారం సాయంత్రానికి 205.66 టిఎంసిల నీటి నిల్వ ఉంది. నాగార్జున సాగర్‌లో 312.5 టిసిఎంలకు గాను 305.62 టిఎంసిలు, పులిచింతలలో 45.77 టిఎంసిలకు గాను 43.21 టిఎంసిలు నీటి నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి ఈ ఏడాది ఐదు నెలలలో ఎక్కువ రోజులు వరద ప్రవాహం కొనసాగింది. ఖరీఫ్ సీజన్‌లలో జులై నుంచి నవంబరు వరకు భారీ వర్షాలు కొనసాగాయి. దీంతో సాగునీటికి ఈఏడాది పెద్దగా ఎద్దడి రాలేదు. ఇప్పటికి శ్రీశైలం, సాగర్, పులిచింతల జలాశయాలకు ఎగువ నుంచి నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రకాశం బ్యారేజి నుంచి ఈ ఏడాది దాదాపు 100 రోజుల కాలంలో 3 వేల టిఎంసిల నీరు సముద్రంలో కలిసింది. అయినా ఈ ఏడాది రెండో పంటగా వరిని ప్రోత్సహించరాదని రాబోయే వేసవి కాలంలో తాగునీటికి. వచ్చే ఏడాది ఖరీఫ్‌లో ముందస్తు సాగు నీటి అవసరాల కోసం ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలను ఉపయోగించాల్సి ఉందని అందువల్ల రబీలో వరికి నీరు ఇవ్వలేమని జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీరు బి.రాంబాబు ప్రకటించారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు కృష్ణానదికి ఎప్పుడూ రానంత విధంగా వరద ప్రవాహం వచ్చిందని, ఇప్పటివరకు ఖరీఫ్ సీజన్‌లో 222 టిఎంసిల నీటిని పంటలకు సరఫరా చేశామని ఆయన వెల్లడించారు. అలాగే ఇంకా ప్రస్తుత ఖరీఫ్ పంటలకు ఇంకా 208 టిఎంసిల నీటిని అందించాల్సి ఉందని, అంతేగాక వచ్చే ఏడాది మే నెల వరకు 20 టిఎంసిల నీటిని తాగునీటికి వినియోగించాల్సి ఉందని ఆయన వివరించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి ఇప్పటి వరకు తమ వాటాగా వినియోగించుకున్న నీటి నిల్వలు పోగా ఇంకా 118 టిఎంసిలు మాత్రమే రానున్న మూడు నెలల కాలంలో వినియోగానికి అవకాశంఉందని అంచనా వేశారు. అందువల్ల భవిష్యత్తు అవసరాలు, రాష్ట్రానికి కేటాయించిన వాటాల ప్రకారం రబీలో వరి సాగుకు అవకాశం ఇవ్వలేమని ఆయన చెప్పారు.

భారత రాజ్యాంగంపై రేపు సదస్సు

హాజరు కానున్న భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మంగళగిరిలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్‌పి వకల్ జిందాల్ శుక్రవారం పరిశీలించారు. భారత రాజ్యాంగం ఆమోదించడానికి మేధావుల సంభాషణ జరిగి నవంబర్ 16 నాటికి 75 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి జస్టిస్ గవాయ్, సిఎం చంద్రబాబుతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానుండటంతో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రధాన వేదిక , సిటింగ్ , పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు అందజేశారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకోవాలని, అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. పరిశీలనలో గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ చక్రవర్తి, హైకోర్ట్ బార్ అసోషియేషన్ అధ్యక్షులు చిదంబరం, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, అడిషనల్ ఎస్పీ హనుమంతరావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై పరిశీలనలో కలెక్టర్, ఎస్పీ

నేడు బిర్సా ముండా జయంతి సభ

ప్రజాశక్తి - విజయవాడ

ఆదివాసీ సమరయోధుడు బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా శనివారం ఉదయం 11 గంటలకు నగరంలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో నివాళి కార్యక్రమం జరుగుతుందని పార్టీ ఆఫీసు కార్యదర్శి జె.జయరామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

బిడ్డ మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరు

కంటెపూడిలో ఈఈఈ విద్యార్థి సృజన్ అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

శ్రీకాకుళం ఐఐఐటీ కళాశాలలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విద్యార్థి ప్రత్తిపాటి సృజన్ మృతదేహాన్ని సత్తెనపల్లి మండలం కంటెపూడికి తీసుకొచ్చారు. చేతికందివచ్చిన కొడుకు విగతజీవిగా మారటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రత్తిపాటి జ్యోతి, శివకృష్ణ దంపతులకు సృజన్‌తోపాటు కుమార్తె షన్మతి ఉన్నారు. ఆర్‌విఆర్ కళాశాల బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్న శివకృష్ణ తన ఇద్దరు పిల్లల్ని చదివిస్తున్నారు. సృజన్ పదోతరగతి గుంటూరు శ్రీచైతన్య కళాశాలలో చదివి 595 మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. అనంతరం శ్రీకాకుళం ఇఇఐటి కళాశాలలో సీటు రావటంతో ఈఈఈలో చేరాడు. షన్మతి పేరేచర్ల విశ్వభారతి కళాశాలలో ఫార్మ్-డీ చదువుతున్నారు. ఈఈఈ మూడో సంవత్సరం చదువుతున్న సృజన్.. కాలేజీ హాస్టల్‌లో మృతిచెందగా మృతదేహాన్ని కంటెపూడికి శుక్రవారం తెచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఇళ్ల స్థలాలు ప్రభుత్వ దయ కాదు..

దక్కే వరకూ పేదల పోరాటానికి అండ : సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి

ప్రజాశక్తి- తాడేపల్లి : ప్రజలకు రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును కాలరాయొద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. సీడ్ యాక్సెస్ రోడ్ నిర్మాణంలో భాగంగా, స్టీల్ బ్రిడ్జి నిర్మాణం సందర్భంగా ఇళ్లు కోల్పోయే కేలరావు కాలనీ వాసులతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. ఇళ్లు కోల్పోయే బాధితులకు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు 2 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్తగా నిర్మించుకునే ఇంటి కోసం రూ.10 లక్షలివ్వాలన్నారు. స్థలాలివ్వడం ప్రభుత్వాల దయాదాక్షిణ్యం కాదని, ప్రజల హక్కని, అవి దక్కే వరకూ పేదలకు పోరాడాలని, అందుకు సిపిఎం అండగా ఉంటుందని అన్నారు. వైసిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బి.వేణుగోపాల సోమిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అమరారెడ్డి కాలనీలో ఇళు తొలగించాల్సి వస్తే ఆత్మకూరు దగ్గర జగనన్న కాలనీలో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు, ఇంటి నిర్మాణానికి రూ.9 లక్షలిచ్చినట్లు చెప్పారు. అదే విధానాన్ని వీరికీ వర్తింపజేయాలన్నారు. ఇక్కడివారికి అనువైన ఉండవల్లి దేవుడి మాన్యంలోని స్థలాన్ని ఇళ్లస్థలాలు ఇవ్వాలని సూచించారు. న్యాయం కోసం పేదలు చేసే పోరాటానికి తాము మద్దతుగా నిలబడతామన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు కె.మేరీ, డివి భాస్కర్‌రెడ్డి, వై.బర్నబాస్, కె.రామకృష్ణ, వి.సామేలు, వైసిపి నాయకులు ఎం.వెంకటరామిరెడ్డి, టి.రామిరెడ్డి, మధు పాల్గొన్నారు.





ఈ నెలాఖరులోగా స్మార్ట్ కార్డులు తీసుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని రేషన్ కార్డుదారులు అందరూ నవంబరు నెలాఖరులోగా స్మార్ట్ రేషన్ కార్డులు తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ రైస్ కార్డులను ప్రభుత్వం ముద్రించి కార్డుదారులకు పంపిణీ చేయాలని ఆదేశించిందని, పంపిణీ ప్రక్రియను సెప్టెంబరు 1 నుండి నుండి సచివాలయాల సిబ్బంది, రేషన్ షాపు డీలర్ల ద్వారా పంపిణీ ప్రారంభించామని పేర్కొన్నారు. ఇందులో ఇప్పటి వరకు 5,36,406 కార్డుదారులకు పంపిణీ పూర్తవగా కొంత మంది ఇతర ప్రాంతాలకు పనుల నిమిత్తం వెళ్లిన కారణంగా, తమ కార్డులు ఎక్కడ ఉందో తెలియకపోవటం తదితర కారణాలతో ఇంకా 49, 209 కార్డులు పంపిణీ కాకుండా సచివాలయాల వద్ద మిగిలి ఉన్నాయని వెల్లడించారు. కావున నవంబరు నెలాఖరు వరకు గడువు పెంచారని, ఇప్పటి వరకు కార్డులు పొందనివారు, తమ సమీప సచివాలయం వద్దకు వెళ్లి తమ కార్డు ఎక్కడ ఉందో తెలుసుకొని, కార్డులోని సభ్యుల్లో ఎవరైనా వేలిముద్ర వేసి స్మార్ట్ కార్డు తీసుకోవాలని సూచించారు.



డిఎస్‌ఓ పి.కోమలి పద్మ

న్యాయవాదిపై హెడ్ కానిస్టేబుల్ దురుసు ప్రవర్తనపై నిరసన

2లో

అప్పుగా ఇప్పించిన డబ్బు కోసం సెల్ టవర్ ఎక్కి..



విద్యార్థినులను అభినందిస్తున్న కలెక్టర్

బాలల హక్కుల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి

ప్రజాశక్తి-గుంటూరు

బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ అధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి బాలల దినోత్సవ వేడుకలలో కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ బాలల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వం సర్వేవల్, పార్టిసిపెంట్, డెవలప్మెంట్, ప్రొటెక్షన్ హక్కులను కల్పించిందని తెలిపారు. దీనిలో భాగంగా ఐసిడిఎస్ ద్వారా 3 నుంచి 6 ఏళ్ల బాలల సమగ్ర అభివద్ధికి అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం, విద్యను, విద్యాశాఖ ద్వారా 6 నుంచి 14 సంవత్సరాలలోపు బాలలకు నిర్బంధ ఉచిత విద్యను, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా నిరంతర వైద్య పరీక్షలు తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, బాల్య వివాహాలపై 1098కి సమాచారం ఇవ్వాలన్నారు. బాలల హక్కులపై రూపొందించిన పోస్టర్లు ఆవిష్కరించారు. అంతర్జాతీయ యోగా అథ్లెట్ డి ధీరజ్ శ్రీకృష్ణను, కిక్ బాక్సింగ్‌లో పథకాలు సాధించిన బాలికలను సన్మానించారు. కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ ప్రమీల డిఆర్ఒ ఖాజావలి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి ప్రసూన పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించుకోవాలి

ప్రజాశక్తి తెనాలి : పురపాలక సంఘ పరిధిలో ఈ ఏడాది ఆగస్టు 31 లోగా చేపట్టిన అనధికార నిర్మాణాలను బిపిఎస్ కింద క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె రామ అప్పల నాయుడు శుక్రవారం తెలిపారు. మార్చి 11, 2026 లోగా ముందుగా రూ.10వేలు చెల్లించి, బిపిఎస్.జిఒవి.ఇన్ లో దరఖాస్తు చేసుకోవాలని, పరిశీలన అనంతరం అధికారులు నిర్ణయించిన ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

తాగునీటి ట్యాంకులు నిరంతరం శుభ్రపరచాలి

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించేందుకు ఓవర్ హెడ్ ట్యాంక్‌లను నిర్దేశిత సమయంలో క్రమం తప్పకుండా శుభ్రపరచాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాతీయ రహదారిపై వరద నీటి డ్రైయిన్ల నిర్మాణం, వాటర్ ట్యాంక్ ల క్లీనింగ్‌పై అధికారులు, కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చినకాకాని నుంచి తాడేపల్లి వరకు వరద నీరు నిలవకుండా ఉండేందుకు జాతీయ రహదారి అధికారులు, మంగళగిరి, తాడేపల్లి నగరపాల సంస్థ అధికారులు సమన్వయంతో డ్రైయిన్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిఎంసి పరిధిలో ట్యాంకులను శుభ్రం చేయటానికి అవసరమైన ప్రెజర్ మిషన్లు కొనుగోలు చేయాలన్నారు. ఉండవల్లి నుంచి రా వాటర్‌ను మరింత మెరుగ్గా పంపింగ్ చేయడానికి నిపుణుల సూచనలు పరిశీలించాలన్నారు. సమావేశంలో ఎంటీఎంసీ కమిషనర్ ఆలీం భాష, జాతీయ రహదారుల పీడి పార్వతీశం, జిఎంసి ఎస్ఈ సుందర రామిరెడ్డి, రేట్ పెయిర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నైపుణ్యాల శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు అర్హత ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నైపుణ్యాల అభివద్ధికి శిక్షణ కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతిపాదిత పారిశ్రామిక క్లస్టర్లకు భూముల కేటాయింపు కోసం పరిశ్రమ శాఖల అధికారులు రెవిన్యూ శాఖతో నిరంతరం సమన్వయం చేసుకోవాలన్నారు. ఏపీఐఐసీ పరిధిలోని ఆటోనగర్లలో కేటాయించిన ప్లాట్లలో వ్యాపారాల మార్పు కోసం అనుమతుల మంజూరుకు నిర్దేశిత నిబంధనలను అధికారులు కచ్చితంగా పాటించాలన్నారు. జిల్లాలో పరిశ్రమలకు వివిధ రాయితీలకు సంబంధించిన 25 క్లైయిమ్‌లకు రూ.95,72,060 ముంజూరు చేస్తూ కమిటీలో ఆమోదించారు. సమావేశంలో డిఆర్ఒ ఎన్.ఎస్.కె.ఖాజావలి, జిల్లా పరిశ్రమల మేనేజర్ జయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయవాదిపై హెడ్ కానిస్టేబుల్ దురుసు ప్రవర్తనపై నిరసన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

న్యాయవాదిపై దురుసుగా ప్రవర్తించిన హెడ్ కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నాలుగు న్యాయస్థానాల్లో విధులను శుక్రవారం బహిష్కరించి న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చిన్నం మణిరావు మాట్లాడుతూ పట్టణంలోని ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఉదయ్‌చంద్ర న్యాయవాది భానుప్రకాష్‌ను ఆపి సమాధానం చెప్పేలోపు తీవ్రంగా దుర్భాషలాడడమే కాకుండా కొట్టడానికి యత్నించాడని అన్నారు. అతనిపై అతనిపై న్యాయస్థానంలో ప్రైవేట్ కేసు దాఖలు చేస్తామన్నారు. నిరసనలో బార్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ జానీ ఖాజావలి, దివ్వెల శ్రీనివాసరావు, శాస్త్రి, గుజ్జర్లపూడి మార్కురావు పాల్గొన్నారు.



అప్పుగా ఇప్పించిన డబ్బు కోసం సెల్ టవర్ ఎక్కి..

ప్రజాశక్తి - ఫిరంగిపురం

తన ద్వారా డబ్బును అప్పుగా తీసుకున్న వ్యక్తి తిరిగివ్వడం లేదంటూ ఒకరు సెల్‌ఫోన్ టవర్ ఎక్కాడు. మండల కేంద్రమైన ఫిరంగిపురంలోని విజ్ఞానపురానికి చెందిన వెరిచర్ల భూషణం పెయింటర్ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబంతో జీవిస్తున్నాడు. ఐదేళ్ల కిందట గుంటూరులోని రోహిత్‌రెడ్డికి రూ.ఐదు లక్షలు ఇప్పించాడు. అప్పటినుంచి వడ్డీ చెల్లిస్తున్నా అసలు మాత్రం ఇవ్వడం లేదని మనస్థాపానికి గురై స్థానిక మార్నింగ్ స్టార్ కళాశాల క్రీడా మైదానం దగ్గర ఉన్న సెల్ ఫోన్ టవర్‌ను ఎక్కాడు. టవర్ నుండి దూకి ఆత్మహత్య చేసుకుంటానని అంటుండడంతో ఇది తెలిసిన పోలీసులు సెల్ టవర్ దగ్గరికి చేరుకున్నారు. భూషణంకు నచ్చజెప్పి కిందకి దించడంతో గుంటూరుకు చెందిన రోహిత్‌రెడ్డిని పిలిపించి తనకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని సిఐ శివరామకృష్ణను కోరాడు. అనంతరం భూషణంను అతని కుటుంబానికి పోలీసులు అప్పగించారు.

అనధికార నిర్మాణాలు, లే అవుట్లపై కఠిన చర్యలు తీసుకొంటాం : కమిషనర్

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పురపాలక సంఘ పరిధిలో అనధికార కట్టడాలు, లేఅవుట్లు వేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని మున్సిపల్ కమీషనర్ వేణుబాబు హెచ్చరించారు. కమీషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం పట్టణంలో అనధికార నిర్మాణాలు, లేఅవుట్లను పరిశీలించి నిర్మాణ పనులను నిలుపుదల చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ వేణుబాబు మాట్లాడుతూ ప్రభుత్వం వారు ప్రస్తుతం అనధికార నిర్మాణాల గురించి 31-08-2025 నాటికి నిర్మించిన అన్ని అనధికార భవనములను క్రమబద్ధీకరించుకొనుటకు ప్రభుత్వం వారి బిల్డింగ్ పినలైజేషన్ స్కీం ను అమలు పరిచియున్నారని, అదేవిధముగా 30-06-2025 నాటికీ ఉన్న అన్ని అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకొనుటకు ప్రభుత్వం వారు లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం అమలు చేశారని తెలిపారు. తదుపరి ఎటువంటి అనధికార నిర్మాణాలు, లేఅవుట్లు చేయుటకు వీలు లేదని, సంబంధిత టౌన్ ప్లానింగ్ సిబ్బంది క్షేత్ర స్థాయి లో పరిశీలించి అన్ని అనధికార నిర్మాణాల పై, లే అవుట్ల పై కఠినమైన చర్యలు చేపట్టవలసినదిగా ప్రభుత్వం వారు తగు ఆదేశములు ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు ప్లాన్ అనుమతులకు విరుద్ధంగా ఉన్న అనధికార నిర్మాణలను నిలుపుదల చేయడం జరిగినదని, భవన యజమానులకు అనధికార నిర్మాణాలు కొనసాగించవద్దని ప్లాన్ అనుమతుల మేరకె భవన నిర్మాణాలను చేపట్టాలని తెలియజేశారు. అనధికర నిర్మాణాలపై చట్ట పరమైన చర్యలు తీసుకొంటామని, అనధికార నిర్మాణాలను కూల్చివేయడం వంటి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కావున పురప్రజలు అనధికార నిర్మాణాలను చేపట్టవద్దని తెలియజేశారు. తప్పని సరిగా నిర్మాణ అనుమతులు పొందిన తరువాతే నిర్మాణాలు చేపట్లాలని సూచించారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం గ్రామ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించారు. బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని, గ్రంథాలయం లో కంప్యూటర్ సదుపాయాన్ని నిరుద్యోగులు ఉపయోగించు కోవాలన్నారు. గ్రంథాలయ అధికార బి.అరుణ మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామన్నారు. చిన్నం శ్రీకాంత్, డి.వెంకటేశ్వరావు, కాకాని సురేష్ పాల్గొన్నారు.

సాక్ష్యాధారాల సేకరణ వాహనాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నేర స్థలంలో సాక్ష్యాధారాల సేకరణకు కొరకు ఆధునికీకరించిన ప్రత్యేక క్రైమ్ స్పాట్ వాహనాలను జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆవిష్కరించారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏవైనా నేరాలు జరిగినప్పుడు, ఆ నేరాలకు సంబంధించి సాక్ష్యాధారాల సేకరణ కొరకు గుంటూరు జిల్లాకు 6 ప్రత్యేక క్రైమ్ స్పాట్ వాహనాలను కేటాయించారు. ఆరు వాహనాల క్లూస్ టీం విభాగం వారు మానిటర్ చేసే విధంగా ఆరు పోలీసు సబ్ డివిజన్లకు ఒక్కో వాజరిగింది. ఈ 06 వాహనాలు క్లూస్ టీం విభాగం వారు మానిటర్ చేసే విధంగా 06 పోలీస్ సబ్ డివిజన్లకు ఒక్కో పోలీస్ సబ్ డివిజన్ కు సంబంధించి ఒక్కో వాహనం పని చేసే విధంగా కేటాయించినట్టు ఎస్‌పి తెలిపారు.



గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి - తుళ్లూరు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథాలయాధికారి పి భాగ్యలత అన్నారు. 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సావాలను పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి రాజేష్ శుక్రవారం ప్రారంభించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జవహర్ లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం నిర్వహించారు. నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాగ్యలత మాట్లాడుతూ వారం రోజులపాటు జరిగే గ్రంథాలయ వారోత్సావాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణా ఫౌండేషన్ నిర్వాహకులు అందించిన టివి, కంప్యూటర్లను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కెవిఆర్ జెడ్పి హైస్కూల్ ఉపాధ్యాయులు డి సుధాకర్,కె నాగబాబు,కె రమేష్ బాబు,గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు డి శుభాకర్, సిహెచ్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా చెన్నుపాటి శివ నాగేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు



ప్రజాశక్తి - పెదనందిపాడు

తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు, వరగాని గ్రామ వాస్తవ్యులు చెన్నుపాటి శివ నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు శుక్రవారం పెదనందిపాడులో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, పూలదండ, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ మండలంలో తన సొంత నిధులతో ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శివ నాగేశ్వరరావు పలువురికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి వారి కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలు ముద్దన రాఘవయ్య, దాసరి శివరాం ప్రసాద్, టిడిపి నాయకులు గూడూరి వీరయ్య చౌదరి, నూతి శ్రీనివాసరావు, బండారు రాంబాబు, షేక్ ఖలీల్, సిహెచ్ హర్ష, పాటిబండ్ల మురళి, విక్రయాలు సుబ్బారావు మండలంలోని పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



చిప్స్ కాలేజి ఆధ్వర్యంలో డయాబెటీస్‌పై అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ డయాబెటిస్ దినం సందర్భంగా చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజి ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం సహకారంతో చౌడవరం గ్రామంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు డయాబెటీస్ నివారణ, ముందస్తు గుర్తింపు, ఆరోగ్యకరమైన జీవనశైలి పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రైమరీ ఆరోగ్య కేంద్రం వద్ద ఉచిత క్యాంప్ నిర్వహించి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎస్‌డబ్ల్యూఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలు, తదితర సమస్యలపై శుక్రవారం గుంటూరు ఆర్టీసి బస్టాండ్ ప్రాంగణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.హరిప్రసాద్ మాట్లాడుతూ పెంచిన పనిగంటలు తగ్గించాలని, స్త్రీశక్తి పథకంలో వచ్చిన సమస్యలను పరిష్కరించాలని, అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని, విద్యుత్ బస్సులను ఆర్టీసినే నిర్వహించాలని, ఆర్టీసి రూట్‌లలో ప్రైవేటు బస్సుల అక్రమ రవాణా అరికట్టాలని, ఆర్టీసి సిబ్బందిపై దాడులు అరికట్టాలని, అన్ని కేటగిరీల ఉద్యోగులకూ ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ధర్నాలో గుంటూరు 1 అధ్యక్షులు ఎస్.మురళీకృష్ణ, ట్రెజరర్ జి.సుబ్బారావు, 2డిపో కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు, మేరీ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులు

జెడిఎగా పద్మావతి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు



వ్యవసాయ జాయి ంట్ డైరెక్టర్‌గా ఎం.పద్మావతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్ కార్యాలయంలో డిడిగా పనిచేస్తున్న ఆమె జెడిఎగా పదోన్నతి పొంది గుంటూరులో నియమితులయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయా ధికారులు నూతన జెడిఎగాకు పుష్పగుచ్చాలు అందచేసి అభినందనలు తెలిపారు. కాగా ఇప్పటి వరకూ డిడి అయితా నాగేశ్వరరావు జెడిఎ ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహించారు.

ద్విచక్రవాహనం దగ్ధం

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలోని ఓ సినిమా హాలు సమీసంలో ద్విచక్రవాహనం దగ్ధం అయిన సంఘ టన చోటు చేసుకుంది. హోంగార్డుగా పని చేస్తున్న మరియ దాసుకు చెందిన ద్విచక్రవాహనాన్ని గృహానికి సమీపంలో పార్క్ చేసాడు. శుక్రవారం ఉదయం వాహనం దగ్ధమైన విషయాన్ని తెలుసుకొని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున చెప్పారు.

కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి- తాడేపల్లి



గుర్తు తెలియని మృతదేహం

తాడేపల్లి పట్నంలోని మహా నాడు సమీపంలోని కృష్ణనదిలో సుమారు 30 ఏళ్ల వయసుగల గుర్తు తెలియని పురుషుని మృత దేహాన్ని శుక్రవారం తాడేపల్లి పోలీసులు కను గొన్నారు. మృతుడి వంటిపై గోధుమ రంగు కలర్ ప్యాంటు, ఆరంజ్ రంగు గల షర్టు ఉన్నాయి. రెండు చెవులకు బంగారు రింగులు ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించినట్టు తాడేపల్లి సిఐ వీరేంద్రబాబు, ఎస్సై ఎస్.కె ఖాజావలి తెలి పారు. మృతునికి సంబంధించి బంధువులుంటే తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.



అనుమతి ప్రతులు, నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్

అనధికార కట్టడాలను కమిషనర్ పరిశీలన

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో అనధికార నిర్మాణాలను మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పల నాయుడు శుక్రవారం పరిశీలించారు. తొలుత పట్ట ణంలోని 22, 27, 28వార్డు లో పర్యటించి అపార్టుమెంట్లలో హోమ్ కంపోస్టింగ్ విధానాన్ని పరిశీలించారు. హోం కంపోస్టింగ్ ఉపయో గాలు, మహిళలు దాని పట్ల ఆసక్తి చూపుతున్న విధానాన్ని తెలుసు కున్నారు. శానిటరీ, మెప్మా బందం దీనిపై ప్రజల్లో అవగా హన పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. తదుపరి 27వ వార్డులో పట్టణ ప్రణాళిక విభాగంతో కలిసి ఆయన పర్యటించారు. కొన్ని నిర్మాణాలను గమనించి, వాటికి పురపాలక సంఘం ఇచ్చిన అను మతులను, ప్లానుకు భిన్నంగా ఏమైనా నిర్మాణం జరిగిందా అన్న కోణంలో పరిశీలించారు. అనుమతులకు భిన్నంగా చేపట్టిన నిర్మా ణాలను బిపిఎస్ కిందకు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఏసిపి వాణి, సిబ్బంది ఉన్నారు.

పొలం విషయంలో పరస్పరం కేసులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని జలాల్పురం గ్రామానికి చెందిన సరిపూడి రామారావు, పువ్వాడ సదాశివరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిబాబు శుక్రవారం తెలిపారు. కొంతకాలం నుండి పొలం విషయంలో వీరిరువురు తగాదా పడ్డారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు పెదకూరపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యా దులు చేసుకున్నారు. ఇద్దరు పైన కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దావా సమన్లు
మహారాజశ్రీ గుంటూరు 1వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఒ.యస్.నెం.54/2019

బిట్వీన్:
బుర్రముక్కు పాముల రెడ్డి .... వాది
మరియు
మన్నెం శ్రీనివాస రావు వగైరాలు ...ప్రతివాదులు

టు,
2వ ప్రతివాది : యర్రమనేని వెంకటేశ్వర రావు , తండ్రి.లక్ష్మీనారాయణ నివాసం.మందడం గ్రామం, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:26-11-2025 కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేక మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:26-11-2025

చింతలపాటి వేంకట రామయ్య,
వాది తరపు అడ్వకేట్,
2/10 బ్రాడీపేట,గుంటూరు.

నోటీసు
మహారాజశ్రీ గుంటూరు ఫ్యామిలీ కోర్టు జడ్జి -కమ్- 12వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
F.C.O.P No.130/2025

బిట్వీన్:
దాసరి సౌజన్య @ బలుసు సౌజన్య ... పిటీషనరు
మరియు
దాసరి యుగంధర్ ....రెస్పాండెంటు

టు,
దాసరి యుగంధర్, తండ్రి.సత్యన్నారాయణ, నివాసం.డోర్ నెం.16-31-43/2, బాలాజీ నగర్ 11వలైను,పాత గుంటూరు, గుంటూరు.

పై నెంబరు పిటీషనులోని పిటీషనరు, రెస్పాండెంటుతో జరిగిన వివాహంను రద్దు పరచమని కొరుచూ దాఖలు చేయగా సదరు పిటీషనులో రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు నోటీసులు పంపించినను ముట్టనందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.02-12-2025నకు వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది:02-12-2025

కె.పద్మశ్రీ,
జె.బి.రమణకుమార్,
జె.కుమార్ రాజా,
పిటీషనరు తరపు అడ్వకేట్స్,
గుంటూరు.

NOTICE
IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE, VIKARABAD DISTRICT, AT: VIKARABAD
M.V.OP. 13 OF 2025

Between:
Shaik Sarvar ...Claimant
And
G. Narsimha Rao and Others ... Respondents

To,
R1. Sri Gadiparthi Narasimha Rao, S/o Peraiah, Aged 42 years, Occupation: Driver, R/o H. No. 19-1067, Sanjeeva Reddy Nagar, Piduguralla, Palnadu District, Andhra Pradesh - 522413.

Please take notice that, the claimant named herein above M.V.OP against you along with other respondents for accidental compensation claim of Rs. 15,00,000/- and the notices were sent on your address but it could not be served with various reasons. The above MVOP stands posted to 28-11-2025 for your counter if any.

Therefore, please make it be convenient to present on 28-11-2025 before the Hon'ble Principal District Judge at Vikarabad at 10.30 AM either personally or through Advocate with your counter if any. Failing which please note that, the matter will be heard and decided in your absence as per material papers available on record. Hence, this notice.

(By Order of the Court)

K.Mounika,
Advocate, Vikarabad.
Cell: 8919420738.

మహారాజశ్రీ వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
ఐ.ఎ. నెం.355/2021
ఓ.యస్ నెం.215/2017

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రిప్రజెంటెడ్ బై నేలటూరి వెంకటేశ్వరరావు,
చీఫ్ మేనేజర్, ఎ.డి.బి బ్రాంచి, వినుకొండ టౌన్,
పల్నాడు జిల్లా, వినుకొండ జె.సి.జె.సి ...వాది
ఎదిరి
గంగదేవి మల్లేశ్వరి ...ప్రతివాది
గంగదేవి మల్లేశ్వరి, భర్త ఆదినారాయణ(లేటు)
గంగదేవి ఫణీంద్ర, తండ్రి ఆదినారాయణ(లేటు)
గంగదేవి తేజ, తండ్రి ఆదినారాయణ(లేటు)
పై అందరి నివాసం:-దోమలగుడం గ్రామం, బొల్లాపల్లి మండలం, పల్నాడుజిల్లా, వినుకొండ జె.సి.జె.సి

పై దావా ఓ.యస్ నెం.215/2017 లోని ఐ.ఎ నెం.355/2021 లోని రెస్పాండెంట్ లకు శ్రీ కోర్టు వారి ద్వారా మరియు రిజిస్ట్రారు పోస్ట్ ద్వారా ఎన్నిపర్యాయములు నోటీసులు జారీ చేసిననూ, మీరు తీసుకొనని కారణముచే శ్రీకోర్టువారు జారిచేసిన ఉత్తర్వుల ప్రకారం రెస్పాండెంట్ లందరూ ది.18-11-2025న ఉదయం 10-30గం॥లకు మీరు స్వయంగా గాని మీ తరపు న్యాయవాది ద్వారా గాని పై తెల్పిన కోర్టునకు హాజరుకావలెనని, మీరు రానియడల శ్రీ కోర్టువారు ఐ.ఎ నెం.355/2021 (ఎఫ్.డి) ను మీ పరోక్షముగా ఉత్తర్వులు జారిచేయుదురని ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా తేది: 18-11-2025

యలవర్తి శ్రీనివాసరావు
న్యాయవాది, వినుకొండ, పల్నాడు జిల్లా
సెల నెం.9440835056

In the Court of the VI Addl. Junior Civil Judge : Guntur
O.S.No. 474 / 2021

Gadde Subba Rao - Plaintiff
Vs
Popuri Satya Narayana - Defendant

Notice

To,
Popuri Satya Narayana,
S/o **Subbaiah,**
residing at D.No.5-21-70,
Satya Nivas Apartment, Flat No.405,
Brodipet, Guntur-522002.

పై నెంబరున వాది మీ నుండి ప్రామిసరి నోటు బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే19-11-2025**దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఆర్.నీలకంఠ ప్రసాద్, బి.కాం. బి.ఎల్.,
కె.షఫి సాహెబ్, బి.ఎ., బి.ఎల్.,
వాది తరపు అడ్వకేట్స్, నెల్లూరు.

బాలల దినోత్సవంలో ఆటపాటల కోలాహలం


చిలకలూరిపేటలో వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే పుల్లారావు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా విలేకర్లు

బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. పలు విద్యాసంస్థల్లో పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా చిలకలూరిపేటలోని శారద జెడ్‌పి పాఠశాలలో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హాజరయ్యారు. విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఎన్‌ఆర్‌ఐలు పాఠశాలలో ఏర్పాటు చేయించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. పసుమర్రులోని శ్రీ మద్ది కామయ్య జెడ్‌పి పాఠశాలలో చెకు ముకి టాలెంట్ టెస్ట్, కౌశల్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన మొహమ్మద్ ఆసీం, మొహమ్మద్ ముస్తాక్, అప్సా, సుహానా, పి.సిరి, ఎన్.పవిత్ర నాగమయికి బహుమతులు అందించారు. నరసరావుపేట మండలం లింగంగుంట్ల శంకర భారతిపురం జెడ్‌పి పాఠశాలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఎస్‌ఆర్ ఫండ్స్ ద్వారా ప్రతిభ కనబరచిన 15 మంది విద్యార్థులకు కొత్త సైకిళ్లను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అందించారు. రంగారెడ్డిపాలెం అంగన్వాడి, ఎలిమెంటరీ స్కూళ్లను ఎమ్మెల్యే సందర్శించి పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఐగ్రో ఇంటర్ నేషనల్ స్కూల్‌లో వేడుకలు నిర్వహించగా డాక్టర్ చదలవాడ ఆదిత్య హాజరయ్యారు. నరసరావుపేట మండలం జొన్నలగడ్డలోని కె-రిడ్జ్ ఇంటర్ నేషనల్ స్కూల్‌లో విద్యార్థులు జూడో, స్కేటింగ్, సంగీతం, నృత్య ప్రదర్శనలు చేశారు. ఉప్పలపాడులోని ప్రభుత్వ పాఠశాలలో న్యూ ఎడ్యుకేషనల్ అండ్ ఎకనామిక్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముప్పాళ్ల మండలం నార్నెపాడులో జిఎంఆర్ మెమోరియల్ పాఠశాల విద్యార్థులు మహాత్మా గాంధీజీ, నెహ్రూ, భరతమాత, సరస్వతి దేవి, అల్లూరి సీతారామరాజు వేషధారణలతో ర్యాలీ చేశారు. సత్తెనపల్లిలోని కస్తూరిబా పాఠశాలలో పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా, వ్యాసరచన పోటీలు నిర్వహించి 15 మందికి రూ.12 వేలతో బహుమతులిచ్చారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యానాది కాలనీ ప్రాథమిక పాఠశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. నెహ్రూ, శివాజీ, రుద్రమదేవి, అల్లూరి సీతారామరాజు వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. వినుకొండలోని గీతమ్స్ బ్లూమ్స్ స్కూల్ మరియు సిద్ధార్థ నగర్‌లోని గీతమ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, కొత్తపేట గీతాంజలి ప్రైమరీ స్కూల్, శావల్యాపురం శ్రీరామ పబ్లిక్ స్కూల్లో వేడుకలు నిర్వహించారు. రెంటచింతల మండలంలోని పలు పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు.


నరసరావుపేటలో వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే అరవిందబాబు

సతీష్ కుమార్ మృతిపై విచారణ జరిపించాలి

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య డిమాండ్

ప్రజాశక్తి - వినుకొండ : పరకామణి చోరీ కేసులో ఫిర్యాదుదారుడు టిడిపి మాజీ ఎవిఎస్‌ఒ సతీష్ కుమార్ మృతి పలు అనుమానాలకు తావిస్తోందని, రవిశంకర్ ఐఎన్‌ఆర్‌తో సమగ్ర విచారణ జరిపించాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. వినుకొండకు శుక్రవారం వచ్చిన ఆయన సతీష్ కుమార్ మృతి వార్త తెలియగానే మీడియాతో మాట్లాడారు. సతీష్‌ని హత్య చేశారా? లేదా ఆత్మహత్య చేసుకున్నాడా? యాదృచ్ఛికంగా చనిపోయాడా అనేదానిపై విచారణ జరిపించాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ రవికుమార్‌పై 2023 ఏప్రిల్‌లో సతీష్ ఫిర్యాదు చేశారని, అప్పట్లో రాజకీయ ఒత్తిళ్ల కారణంగా రాజీ చేసుకున్నారని, దీనిపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా సిఐడి డీజీ రవిశంకర్ ఐఎన్‌ఆర్ బృందం దర్యాప్తు చేస్తుందని, కీలక దశకు చేరుతున్న సమయంలో సతీష్ మృతి చెందడం సందేహాస్పదంగా ఉందని అన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు జియో ట్యాగింగ్ చేయించుకోవాలి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : నూతనంగా మంజూరైన పక్కా గృహ నిర్మాణాల కోసం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జియోట్యాగింగ్ చేస్తున్నట్లు గృహ నిర్మాణ శాఖ ఏఈ మరియదాసు శుక్రవారం తెలిపారు. పక్కా గృహాలు కావాల్సిన వారు ఎక్కడైతే ఇల్లు కట్టుకుంటారో అక్కడ జియో ట్యాగింగ్ చేయుంచుకోవాలని, ఈనెల 30వ తేదీ వరకు సర్వే జరుగుతుందని చెప్పారు.

17 నుంచి ఆధార్ క్యాంప్‌లు

ప్రజాశక్తి - మాచర్ల : పట్టణంలో ఈ నెల 17 నుంచి 26 వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. పట్టణంలోని జెడ్‌పి బాలుర, బాలికల హైస్కూల్, గడియార స్తంభం దగ్గర ఉన్న అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో క్యాంపులు ఉంటాయని, ప్రజలందరూ ఆధార్ సంబంధిత సేవలను సద్వినియోగపరచుకోవాలని కోరారు.

18న మాచర్ల ఎస్‌కెబిఆర్ కాలేజీలో జాబ్ మేళా

ప్రజాశక్తి - మాచర్ల : స్థానిక ఎస్‌కెవిఆర్ డిగ్రీ కాలేజీలో ఈనెల 18న జాబ్ మేళాను నిర్వహిస్తామని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజిరావు, కాలేజీ ప్రిన్సిపల్ లక్ష్మి కుమారి శుక్రవారం తెలిపారు. వి చేంజ్ సొల్యూషన్, బీడ్ అలర్ట్, ఆర్‌ఎస్, ఇన్ఫోకాం సొల్యూషన్, హెటిరో డ్రగ్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, పేటియం, యం.ఆర్.ఎఫ్ టైర్స్, ఇన్నోవే సోర్స్, టి.వి.ఎస్ బ్యాటరీ, టాటా ఎలక్ట్రానిక్స్ మరియు స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లెమిటెడ్ వంటి పలు రకాల కంపెనీలు ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు చేపడతాయని, నియోజకవర్గ పరిసర ప్రాంత యువతి యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్హతను బట్టి సుమారు రూ.12 వేల నుండి రూ.35 వేల రకు జీతం ఉంటుందన్నారు. ఎస్.ఎస్.సి, ఇంటర్, ఐటిఐ డిగ్రీ, బి.టెక్, డిప్లొమా, ఫార్మసి, పి.జి విద్యార్హతలున్న 18-35 ఏళ్లవారు అర్హులని, బయోడేటా, చదువు ధ్రువపత్రాల ఫొటోస్టాట్ కాపీలు, ఆధార్ నకలు, పాస్ పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరవ్వొచ్చని, ఆసక్తి ఉన్నవారు ముందుగా https://naipunyam. ap.gov. in/user-registration అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాల కోసం ఆర్.కిరణ్ నాయక్ : 7842747682, శ్రీకాంత్ : 9492158153 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇళ్లులేని వారితో దరఖాస్తులు పెట్టించండి

ప్రజాశక్తి - వినుకొండ : శావల్యాపురం మండల ప్రజా ప్రతినిధులు, అధికారులతో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శుక్రవారం సమీక్షించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను, గ్రామస్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తీసుకురాగానే అధికారులు స్పందించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఇంటి స్థలం, ఇల్లు లేని అర్హులైన పేదల చేత దరఖాస్తులు పెట్టించాలన్నారు. సంక్షేమ పథకాలు ఇంటింటికి తీసుకువెళ్లాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు జాప్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.




20న నరసరావుపేటలో భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-సత్తెనపల్లి

భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈనెల 20న పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో గాంధీ పార్క్ (ధర్నా చౌక్) వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు అవ్వారు ప్రసాద్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మన గ్రోమోర్ సెంటర్లో కరపత్రల పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాల్మర్ రాజు, ఎం.హరిపోతురాజు, జె.రాజకుమార్, కార్మికులు రామారావు, సిహెచ్.కొండలు పాల్గొన్నారు.


ప్రజాశక్తి - వినుకొండ

ధర్నా కరపత్రాన్ని స్థానిక పుతుంబాక వెంకటపతి భవన్‌లో ఆవిష్కరించారు. నాయకులు ఎ.ఆంజనేయులు, ఆర్.శంకర్, జి.గురువాచారి, జగన్మోహన్రావు, పి.వెంకటప్పయ్య, కె.హనుమంత్‌రెడ్డి, నాగతులసీరావ్, జి.శ్రీనివాసరావు, శ్రీను పాల్గొన్నారు.

హాకీ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి ఎంపిక



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కూల్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల అండర్-19 హాకీ పోటీలకు నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాల జూనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థి షేక్ అమిత్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ శుక్రవారం తెలిపారు. ఈనెల 22న విశాఖపట్నంలో జరిగే పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు అమిత్ ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అమిత్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కె.విజయకుమార్, సెక్రెటరి - కరస్పాండెంట్, ఎన్.సుబ్బరాయగుప్తా, జాయింట్ సెక్రెటరి యు.వెంకటఅప్పారావు, పాలకవర్గ సభ్యులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, పీడీ డాక్టర్ వై.మధుసూదనరావు అభినందించారు.

13న లోక్ అదాలత్‌తో ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వచ్చేనెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని పోలీస్ అధికారులను సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికారి కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి.విజయ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సత్తెనపల్లి సబ్ కోర్ట్ హాల్లో నాలుగు న్యాయస్థానాల పరిధిలోని పోలీస్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువ క్రిమినల్ కేసులు పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాజీ పడదగిన సెక్షన్లు వర్తించే కేసులు ఎన్ని ఉన్నాయో వివరాలు అడిగారు. సమీక్షలో న్యాయమూర్తులు పి.ప్రియదర్శిని, జె.సుజన్ కుమార్, డీఎస్పీ ఎం.హనుమంతరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక ప్రధాన సివిల్ జడ్జ్ కోర్టులో బ్యాంకు మేనేజర్ల, బ్యాంకు న్యాయవాదులతోనూ, స్థానిక న్యాయవాదుల సంఘం సభ్యులతో మండల న్యాయ సేవ కమిటీ చైర్మన్, న్యాయమూర్తి శ్రీనివాస్ కళ్యాణ్ సమావేశమయ్యారు. జాతీయ లోక్ అదాలత్‌లో సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించడానికి సహకరించాలని కోరారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వై.రమేష్‌బాబు, ప్రభుత్వ న్యాయవాది జి.శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు సిహెచ్ నాగిరెడ్డి, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఇన్ఫోసిస్‌లో 46 మంది 'తిరుమల' విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ఇన్ఫోసిస్ కంపెనీ ఏపిఐటిఏ ఆధ్వర్యంలో గుంటూరు కిట్స్ కళాశాలలో ఈ నెల 5న నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తమ విద్యార్థులు 46 మంది ఉద్యోగాలు సాధించారని తిరుమల కళాశాల ప్రిన్సిపల్ ఫౌండర్ ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ శుక్రవారం తెలిపారు. మొత్తం 68 మంది ఎంపికవగా వారిలో తమ విద్యార్థులే 46 మంది ఉండడం హర్షణీయమన్నారు. ఎంపికైనవారికి శిక్షణా కాలంలో వార్షిక వేతనం రూ.3.60 లక్షలు ఉంటుందని కంపెనీ ప్రతినిధులు తెలిపినట్లు చెప్పారు. వీరిని కళాశాల చైర్మన్ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, సెక్రటరీ - కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, టిపిఓ ఎం.సాంబశివరావు అభినందించారు.

ఆ స్థలాన్ని పేదలకివ్వండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేటలోని టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం నిర్వహించిన ప్రజావేదికలో పలువురు అర్జీలిచ్చారు.



నరసరావుపేట మండలం రంగారెడ్డిపాలెంలో వైసిపి హయాంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన 6 ఎకరాలను వైసిపి నాయకులు కబ్జా చేయాలని ప్రయత్నించారని గ్రామస్తులు ఫిర్యాదు చేయగా ఎమ్మెల్యే వెళ్లి గ్రామంలో పర్యటించారు. ఈ భూమిని ఇళ్ల లేని పేదలకు పంపిణీ చేసేందుకు పట్టాలు సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

శకుంతల జనరల్-గ్యాస్ట్రో లివర్ కేర్ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-ముప్పాళ్ల : వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా నరసరావుపేట శకుంతల జనరల్-గ్యాస్ట్రో లివర్ కేర్ హాస్పిటల్ (దత్తు గారి హాస్పిటల్) అధినేత డాక్టర్ ఐలా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముప్పాళ్లలోని సచివాలయంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. 70 మందికి పైగా బిపి, షుగర్, జలుబు, దగ్గు, జ్వరం వంటి సాధారణ వ్యాధులతో పాటు గ్యాస్, లివర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో హైదరాబాద్, విజయవాడ, గుంటూరు వంటి మహా నగరాలకు దీటుగా అత్యాధునిక వైద్య సేవలను అందుబాటు ధరల్లో అందిస్తున్నట్లు చెప్పారు.

8 మంది ఎంఎఎం విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట మండలం కేసానుపల్లిలోని ఎంఎఎం గ్రూప్ ఆఫ్ కళాశాలలో శుక్రవారం బెంగళూరుకు చెందిన గ్లోబల్ క్వెస్ట్ టెక్నాలజీస్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 8 మంది



విద్యార్థినులు ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య తెలిపారు. వీరికి రూ.4 లక్షల వార్షిక వేతనం వస్తుందని చెప్పారు. ఎంపికైన వారిని కళాశాల చైర్మన్ ఎం.రామశేషగిరిరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రామారావు టిపిఒ జె. రవిశంకర్, విభాగాధిపతులు నవీన్, సితార అభినందించారు.

జిల్లా మహాసభను విజయవంతం చేయాలి : సిఐటియు



ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు నాయకులు వై నేతాజీ తదితరులు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఈనెల 23, 24 తేదీలలో తాడేపల్లిలో జరిగే సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం తాడేపల్లి, తెనాలి, గుంటూరులో సిఐటియు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్ నగర్‌లో ప్రచారం ని సిఐటియు రాష్ట్ర నాయకులు వై.నేతాజీ మాట్లాడుతూ మహాసభల సందర్భంగా తాడేపల్లిలో జరిగే ర్యాలీకి కార్మికులు కుటుంబాలతో తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లా నలుమూలల నుండి 300 మంది ఎంపికైన ప్రతినిధులు మహాసభకు వస్తారని చెప్పారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ ప్రణాళికను ఈ మహాసభల్లో రూపొందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. 4 లేబర్ కోడ్లను తీసుకొచ్చి, పెట్టుబడిదారులకు కార్మికుల శ్రమను అప్పనంగా దోచిపెడుతుందని విమర్శించారు. 8 గంటల పని స్థానంలో 12 గంటల పని విధానాన్ని తీసుకురావడానికి, చట్టాలను మార్చారని ధ్వజం ఎత్తారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఈ విధానాలకు మద్దతు తెలుపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గాన్ని కూడగట్టి, ప్రైవేటీకరణ విధానాలపై రాజీలేని పోరాటాలు సిఐటియు నిర్వహిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు నాయకులు సంతోషం, బి.ఏసయ్య, కమల పాల్గొన్నారు.


కార్మికులతో మాట్లాడుతున్న బాబు ప్రసాద్, హుస్సేన్ వలి

ప్రజాశక్తి-తెనాలిరూరల్ :సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని తెనాలి ఎపి బ్రేవరేజెస్ ముఠా కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశంలో జిల్లా కార్యదర్శి కె బాబు ప్రసాద్ పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల సమస్యలపై నిరంతరం పోరాడే ఏకైక సంఘం సిఐటియు అని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి, ముఠా కార్మిక సంఘం నాయకులు కె మల్లికార్జునరావు, ఎన్ చిన్న గోపాలరావు, వి వెంకటరావు, పెరుమాళ్ళ మురళి, మాదాల శ్రీను, అరిగి డేనియల్, ఎన్ మోహనరావు, ఎ రాంబాబు, బి శివ నాగరాజు, షేక్ మస్తాన్, షేక్ ఖాసీం, జె కొండయ్య, జి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముత్యాలరావు

సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

విశాఖ పట్టణంలో డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు ఐదు రోజులపాటు జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు గుంటూరు పశ్చిమ నగర కార్యదర్శి బి.ముత్యాలరావు పిలుపునిచ్చారు. శుక్రవారం సెయింట్ జోసెఫ్ స్కూల్ ఆటోస్టాండ్ కార్మికుల జనరల్‌బాడీ సమావేశంలో ముత్యాలరావు మాట్లాడుతూ మహాసభల ముగింపు సందర్భంగా 4వ తేదీన విశాఖ పట్టణంలో భారీ ర్యాలీ, ప్రదర్శన జరుగుతుందని, కార్మికులు వేలాదిగా తరలి రావాలన్నారు. దేశంలో కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ విధానాలపై ఐదు రోజుల మహాసభలో చర్చించి, తీర్మానాలు చేయటం జరుగుతుందని, భవిష్యత్ పోరాట కార్యాచరణ నిర్దేశించుకుంటామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గంపై దాడిని తీవ్రం చేశాయని, కార్మిక చట్టాలు రద్దు చేశారని, పెట్టుబడిదారులకు కట్టుబానిసలుగా కార్మికుల్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విధానాలను వ్యతిరేకంగా సిఐటియు రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి హకులను కాపాడుకోవాలని కోరారు. నగర ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ రాష్ట్ర, దేశవ్యాప్తంగానూ ఆటో, లారీ తదితర ప్రైవేటు రవాణా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సిఐటియు నాయకత్వంలో అనేక పోరాటాలు నిర్వహించామని తెలిపారు.

29,30 తేదీల్లో బాలల పండుగ

మూడవ పిల్లల బాలోత్సవం బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తుళ్లూరు

మంగళగిరి, తాడేపల్లి బాలోత్సవం మూడవ పిల్లల పండుగ ఈ నెల 29, 30 తేదీల్లో మంగళగిరి మండలం నిడమర్రు రోడ్డులోని అరవింద మోడల్ స్కూలులో నిర్వహిస్తున్న స్థానిక కెవిఆర్ జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం బాలోత్సవ బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. మండలంలోని ప్రతి పాఠశాలకు, హైస్కూల్‌కు బ్రోచర్ పంపిణీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా నిర్వహణ కార్యదర్శి ఎస్.కె.బాజీసైదా, యు.రాజశేఖర్, ఉపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లల్లో సామాజిక చైతన్యం, సృజనాత్మకతను వెలికి తీసేందుకు బాలోత్సవం దోహదపడుతుందని పేర్కొన్నారు. మూడవ బాలోత్సవం మూడు విభాగాల్లో 13 అకడమిక్, 9 సాంస్కృతిక కార్యాక్రమాలలో 37 రకాల పోటీలు నిర్వహిస్తామని వివరించారు. మంగళగిరి - తాడేపల్లి నగరపాలకసంస్థ, దుగ్గిరాల, తుళ్లూరు మండలాల పరిధిలోని పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు ఈ ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. చిత్రలేఖనం, స్పాట్ డ్రాయింగ్, వ్యాసరచన, స్వచ్ఛ తెలుగు, తెలుగుకవితారచన, ఉపన్యాసం, స్పెల్ బి (ఇంగ్లిష్), సైన్స్ ఎగ్జిబిషన్, పద్యం-భావం, మట్టితో బొమ్మలతయారీ, క్విజ్, మ్యాప్ వంటి పోటీలు జరుగుతాయన్నారు. ఏకపాత్రాభినయం, విచిత్ర వేషధారణ, దేశభక్తి, అభ్యుదయ గీతాలాపన, జానపద నృత్యం, శాస్త్రీయ నృత్యం, లఘునాటిక (స్కిట్), కోలాటం, ఫ్యాన్సీ డ్రెస్, రైమ్స్ వంటి పోటీలుంటాయన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థినీ, విద్యార్థులకు, పాఠశాల ఆర్గనైజర్లకు మధ్యాహ్న భోజన సదుపాయం వుంటుందని నిర్వాహకులు తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రసాద్, శ్రీనివాస్ ప్రసాద్, ఎస్.వరలక్ష్మి, బి.సుధాకరరావు, కె.శ్యాంప్రసాద్, నాగబాబు, జి.అన్నపూర్ణమ్మ, యశ్వంత్ పాల్గొన్నారు.




బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపిడివో శిల్పా

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - తుళ్లూరు

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని ఎంపిడివో కానూరి శిల్పా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ - క్రాఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం బాలల హక్కుల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఎంపిడివో మాట్లాడుతూ, బాలల హక్కులు, విద్య,సంక్షేమం గురించి అవగాహన పెంచడానికి బాలల హక్కుల దినోత్సవం జరుపుకుంటున్నామని చెప్పారు. సమావేశంలో క్రాఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ జి.వెంకట్, ఎంపిడివో కార్యాలయ సిబ్బంది వై.సాయిదేశిక్, సీనియర్ అసిస్టెంట్ గీతా లక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సమతావాణి, తదితరులు

ప్రజాశక్తి - తాడికొండ

బాలల స్నేహ సమాజం నిర్మించడం మన అందరి బాధ్యత అని కె.సమతావాణి అన్నారు. శుక్రవారం చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ - క్రాఫ్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడు తూ బాలల స్నేహ సమాజం నిర్మించడం మన అందరి బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖరరావు,చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ ప్రతినిధి వెంకట్,లక్ష్మి ప్రసన్న, త్రివేణి, హిందూమతి, వెలుగు ప్రాజెక్ట్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్స్ నాగేశ్వరరావు, జగ్జీవన్ రామ్, విజయభారతి,జయశ్రీ,అజీమ్ ప్రేమజీ ఫౌండేషన్ సిబ్బంది రవికుమార్, త్రివేణి పాల్గొన్నారు.





వడ్డేశ్వరం జిల్లాపరిషత్ విద్యార్థులకు బహుమతులు అందజేత, తహశీల్దార్ గోపాలకృష్ణను సన్మానిస్తున్న వివేకానంద స్కూల్ యాజమాన్యం, పెదకాకానిలో మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటరమణయ్య

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

తాడేపల్లి రూరల్ : వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప ప్రసంగించారు. విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించి, బహుమతులను మాజీ సర్పంచ్ షేక్ చిన్న రంగా షరీఫ్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు మెల్లంపూడి రవి, నూతక్కి రవి, పసులూరి సతీష్ కుమార్, పాఠశాల ఉపాధ్యా యులు రామచంద్రారెడ్డి, ఆనంద్, వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాస రావు, అనిలా సుల్తానా, తదితరులు పాల్గొన్నారు.

తెనాలి రూరల్ : విద్యార్థులకు విద్యతోపాటు సంస్కారం కూడా అలవరచాలని తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణ అభిప్రాయపడ్డారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డు వివేకానంద సెంట్రల్ స్కూల్‌లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సభకు వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణను వివేక విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు డాక్టర్ కె.రామరాజు, గుత్తా వెంకటరత్నం సన్మానించారు.

తాడికొండ : గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిస్టర్ డియానా, బత్తుల బాబు, పవన్, దిలీప్ కుమార్, బాలబాబు పాల్గొన్నారు.

పెదకాకాని : మండల పరిధిలోని అన్ని గ్రామాలలోని పాఠశాలల్లో బాలల దినోత్సవం నిర్వహించారు.మండల విద్యాశాఖ అధికారి బి.వెంకటరమణయ్య నెహ్రూ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.జ్యోతి, వి.రాదిక, టి.వి.నాగలక్ష్మి మరియు స్థానికులు పాల్గొన్నారు.

తుళ్లూరు : గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్‌లో అనంతవరంలోని జెడ్పి స్కూల్‌లో బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ మాట్లాడారు. వడ్డమాను, నెక్కల్లు, అనంతవరం గ్రామాలలో గుడ్ షెఫర్డ్ సిస్టర్స్ నిర్వహించిన డ్రాయింగ్ పోటీలలో విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యం, గుడ్ షెఫర్డ్ సిస్టర్ వసుంధర, కోఆర్డినేటర్ కె.అనూష, పి.అనిల్‌కుమార్, ఎ.పోతురాజు, ఎన్. నాగమణి, బి.విజయలక్ష్మి, జె.ఇశ్రాయేల్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి : గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్‌లో భాగంగా మంగళగిరి టౌన్ పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఎస్సై బి.రవీంద్ర నాయక్ బాలల దినోత్సవం గోడ పత్రిక ఆవిష్కరించారు. సిస్టర్ వసుంధర, ఎస్ఐ మాట్లాడారు. కార్యక్రమంలో స్టాఫ్ అత్తోట పోతురాజు, కె.అనూష, పి.అనిల్ కుమార్, ఎన్.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

భారత్ కేర్ సొసైటీ ఆధ్వర్యంలో..

భారత్ కేర్ సొసైటీ ఎన్జీవోస్ ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బాలల దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ కె. శకుంతల మాట్లాడారు.

కొల్లిపర : . బాలల దినోత్సవ సందర్భ గా కొల్లిపర మండలం మున్నంగి ప్రాథమిక పాఠశాల (ఎల్ ఈ)లో బాలల దినోత్సవ వేడుకలు జరిగాయి. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ 2 ఝాన్సీ లత ప్రధానోపాధ్యాయిని మునగాల ధనలక్ష్మితో కలిసి బహుమతులు అందజేశారు.





మంగళగిరిలో బాలల దినోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఐ రవీంద్ర, మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ శకుంతల



అమరావతిలో కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే, ఇతర నాయకులు

టిడిపి నూతన కమిటీల ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - అమరావతి

నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నూతన కమిటీల ప్రమాణ స్వీకారోత్సవంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నియోజకవర్గ పరిశీ ల కులు నల్లపాటి రాముతో కలిసి మండల, గ్రామ అధ్యక్షులు క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జీలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనం తరం ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపునిచ్చే ఏకైక పార్టీ తెలుగుదేశం మాత్రమే అన్నారు. చిన్న చిన్న మనస్పర్ధనలను ప్రక్కన పెట్టి రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే నియోజకవర్గ అభివృద్ధికి రూ.150 కోట్లను తెచ్చామన్నారు. అమరావతి నుండి బెల్లంకొండ రోడ్డు నిర్మాణానికి నిధులను తెచ్చి పను లను పూర్తి చేసేలా కషి చేస్తున్నారు. ప్రతి ఒక్కరి కర్తవ్యాన్ని బాధ్యతా యుతంగా నిర్వర్తించి నియోజకవర్గ భవిష్యత్తు నిర్మాణం కోసం కషి చేయాలని కోరుతూ. బందరు పోర్టుకు వెళ్ళే 300 కి.మీ. నూతన రహదారి పెదకూరపాడు నియోజకవర్గం మీదుగా పోతుందని ఈ ప్రాంతంలో రెండవ ఎగ్జిట్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా :



నరసరావుపేటఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యం లో టిడిపి మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ బూత్ ఇంచార్జీల ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం నరసరావు పేట పట్టణం ప్రకాష్‌నగర్ భువనచంద్ర టౌన్‌హాల్‌లో అట్టహాసంగా నిర్వహిం చారు. ఎమ్మెల్యే అరవింద బాబు పార్టీ నేతలచే ప్రమాణం చేయించారు. నియోజక వర్గంలోని అన్ని స్థాయిల టిడిపి ఇంచార్జీలు పార్టీ ఆశయాలకు కట్టుబడి పనిచేస్తామని ప్రమాణం చేశారు. అనంతరం ఎమ్మెల్యే అర విందబాబు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల బాధ్యతలను గుర్తు చేస్తూ, నరసరావు పేట నియోజకవర్గ అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కళా సమితి బృందం

ప్రజల గొంతుకలో పాట అందెశ్రీ

ప్రజాశక్తి - తెనాలి
అందెశ్రీ రచించిన పద్యాలు, పాటలకు వేనోళ్ల నీరాజనాలు అందుకుంటున్నాయని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ అన్నారు. స్థానిక గాంధీనగర్ ఇస్కఫ్ కార్యాలయ ప్రాంగణంలో అభ్యుదయ కళా సమితి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో అందెశ్రీ సంతాప సభ శుక్రవారం జరిగింది. కృష్ణ మాట్లాడుతూ అందెశ్రీ ప్రజల గొంతుకల్లో పాటయ్యాడని, కష్టాలు అనుభవిస్తూ చాకిరీ చేసి జీవించారన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కంకిపాటి రమేష్ కుమార్, శ్రీనివాసరెడ్డి, ఐజేయూ సభ్యులు ఓతుకోలు మార్కండేయులు, బి. సుధాకర్, రామకృష్ణారెడ్డి, సునీల్, కన్నెగంటి మౌనిక పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు
నవంబర్ 14 భారతదేశ తొలి ప్రధాని, ఆధునిక అభివృద్ధికి చొరవ చూపిన జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా చిన్న కొండ్రుపాడు మెయిన్ పాఠశాలలో నెహ్రూ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. పాఠశాలలో చదువుతున్న పద్మజ రాణి టీచర్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ పాఠశాల ఛైర్మన్ పోతురాజు లక్ష్మి నారాయణ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.
ఫోటో2.. బాలల హక్కుల గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న తాడేపల్లి మండల తాసిల్దార్ సీతారామయ్య, ఎంఈఓ డి నాగేశ్వరరావు , గుడ్ షెపర్డ్ సిస్టర్స్, ప్రతినిధులు.

బాలల హక్కుల దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్
స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టులో భాగంగా బాలల హక్కుల దినోత్సవం గోడ పత్రిక ఆవిష్కరించారు. తహశీల్దార్ డి.సీతారామయ్య, డిప్యూటీ తహశీల్దార్ ఎస్.కె. రిజ్వాన్, ఎంఈఓ డి.నాగేశ్వరరావు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. తహశీల్దార్ సీతారామయ్య మాట్లాడుతూ 20వ తేదీన వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. గుడ్ షెఫర్డ్ సిస్టర్స్ చేస్తున్న సేవలు మరువలేనివని కొనియాడారు. ఎంఈఓ నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో గుడ్ సెపరేట్ సిస్టర్ వసుంధర, గుడ్ షెఫర్డ్ ప్రతినిధులు అత్తోట పోతురాజు, కె.అనూష, ఎన్.నాగమణి, పి.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ

ప్రజాశక్తి - తెనాలి
రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి అధినేత పిలుపుమేరకు కోటి సంతకాల సేకరణలో భాగంగా స్థానిక రత్నా టాకీస్ కూడలి జామియా మసీదు వద్ద సంతకాలు సేకరణ శుక్రవారం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో చేపట్టిన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, పార్టీ నాయకులు గోల్డ్ రహిమా, షేక్ దుబాయ్ బాబు, సుభాని, చాంద్ బాషా, సయ్యద్ ఖలీల్, షేక్ ఆసిఫ్, సయ్యద్ గౌస్, ఖాజా, షేక్ బాదుల్లా, షేక్ నూర్ ఇస్మాయిల్ , మహమ్మద్ సాదిక్, షేక్ ఫరీద్, షేక్ ఖదీర్, షేక్ రఫీ, ఎంపీటీసీ ఇలియాజ్, సర్పంచ్ షేక్ బాషా, షేక్ సలీం పాల్గొన్నారు.

విద్యార్థులు శారీరక ఆనందం కలిగి ఉండాలి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్
విద్యార్థులు ఎల్లప్పుడూ శారీరక మానసిక ఆనందం కలిగి ఉండాలని, అందుకు క్రీడ, సాంస్కృతిక రంగాలను ఎంచుకోవాలని పలువురు సూచించారు. ఆత్మకూరు నిర్మల ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ శుక్రవారం చిల్డ్రన్స్ డే వేడుకలు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిస్టర్ జ్ఞాన సౌందరి, సిస్టర్ జోస్పిన్ , కోఆర్డినేటర్ సువిశ్వేశ్వర రావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు కుమారి

ప్రజాశక్తి-తెనాలిరూరల్
అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్ పిల్లలతో బలోపేతానికి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విలీనంచేయడం ఆపాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎ.వి.ఎన్ కుమారి అన్నారు. శుక్రవారం నందివెలుగు సచివాలయంలో లబ్ధిదారులతో కలసి పంచాయతీ కార్యదర్శి బి.హేమకుమారికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీస్కూల్ పిల్లలు సంఖ్య నానాటికి తగ్గుతుందని, ఈ కారణంగా సెంటర్లను పాఠశాలల్లో విలీనం చేయాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ప్రీ స్కూల్ బలోపేతం చెయ్యాలంటే 3 నుండి 6 ఏళ్ల లోపు చిన్నారులను రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు అయ్యేవిధంగా చూడాలన్నారు. అంతేకాకుండా అంగన్‌వాడీ సెంటర్లలోనే ఉండే విధంగా ప్రైవేటు పాఠశాలలకు కూడా జిఓ ఇవ్వాలని, ప్రీస్కూల్ పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలని, మెనూ క్వాంటిటీని పెంచాలని, ప్రీస్కూల్ పిల్లలకు యూనిఫామ్, టై, బెల్ట్, బూట్లు పంపిణి చేయాలని డిమాండ్ చేసారు. అంగన్వాడి సెంటర్లను ప్రీ స్కూల్ పిల్లలతో బలోపేతం చేయాలని కోరుతూ లబ్దిదారులతో అన్ని సచివాలయాల్లో వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు.

రైతులకు విశ్రాంత ఉపాధ్యాయుడు చేయూత


రైతులకు ఆర్థికసాయం అందిస్తున్న చింపయ్య మాస్టారు

ప్రజాశక్తి - తెనాలిరూరల్
తుపాను కారణంగా పంట నష్టపోయిన కౌలు రైతులకు విశ్రాంత ఉపాధ్యాయులు, చింపయ్య మాస్టారు చేయూతనివ్వడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ కౌలు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పెన్షనర్ భవన్లో వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పంట నష్టపోయిన ఐదుగురు కౌలు రైతులకు ఉపాధ్యాయ రత్న చింపయ్య ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ చింపయ్య మాస్టారు ఔదార్యంతో కౌలు రైతులకు చేయూతనివ్వటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తెనాలి పెన్షనర్ల సంఘం కార్యదర్శి మాచిరాజు రామకఅష్ణమూర్తి, పి. ఎల్.వి సూర్యప్రకాశ రావు, ఎన్జీవో నాయకులు గరికపాటి సుబ్బారావు, నేలపాడు సర్పంచి సోమవరపు నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలు ప్రారంభం


ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఎల్‌సిఓ రామారావు

ప్రజాశక్తి - తెనాలి
స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని డివిజనల్ కోఆపరేటివ్ కార్యాలయంలో శుక్రవారం సహకార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ కె.వి.రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత సహకారం జెండా ఆవిష్కరించి, సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. వారోత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25లో సహకార సంఘాల కంప్యూటరీకరణకు సీఈవోలు అందించిన సహకారం గొప్పదన్నారు. సహకార సంఘాల డిజిటలైజేషన్ ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన ఉందని, అందులోనూ గుంటూరు జిల్లాలోని 64 సంఘాలనూ డిజిటలైజ్ చేశామని వివరించారు. కార్యక్రమంలో డివిజనల్ అధికారి జె.రామచంద్రనాద్, సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

రబీ పంటలలో సమగ్ర సస్యరక్షణపై రైతులకు అవగాహన


డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు
రబీ పంటలలో రైతులకు సమగ్ర సస్య రక్షణపై మండల పరిధిలోని తుమ్మలపాలెంలో ఆత్మ సౌజన్యంతో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ జేడీఏ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పంటలలో యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. సైంటిస్టు డాక్టర్ గంగాదేవి, ఏడీఏ మోహన్ రావు మాట్లాడుతూ డ్రోన్ ద్వారా పురుగు మందులు ఏ విధంగా సులభంగా పిచికారి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి షేక్ సుగుణ బేగం, వి.హెచ్.ఏ చిన్ని రాజా, ఏసురత్నం, విఏఏలు గోపి, నాగరాజు, ఎంపీఈఓ నిలాంబరం రైతులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తాం : ఎమ్మెల్యే ధూళిపాళ్ల

ప్రజాశక్తి - పొన్నూరు
అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన 138 ఇళ్ల పట్టాలను శుక్రవారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పొన్నూరు పట్టణంలో ఉన్న పేదవాళ్లను దృష్టిలో పెట్టుకొని 2399 ఇళ్లను మంజూరు చేశామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్ట మొదటిసారిగా పట్టణంలో 138 మందికి తొలి విడతగా ఇల్లు కట్టుకోవడానికి ప్రస్తుతం అనుమతి పత్రాలు లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అర్హత ఉండి ఇంకా ఎవరైనా ఇల్లు కట్టుకుంటామంటే వారికి ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నూరు నియోజకవర్గ సమన్వయ కర్త వడ్రాణం మార్కండేయ బాబు, మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు, హౌసింగ్ డిపార్ట్‌మెంట్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజన సౌకర్యాలను పరిశీలించి, అల్పాహారం చేస్తున్న ప్రజలను ఆహార పదార్థాల గురించి అడిగి తెలుసు కున్నారు. అన్న క్యాంటీన్ పరిసరాల్లో ఎల్లప్పుడూ పరిశు భ్రత పాటించాలని, ప్రజలకు పరిశుభ్రమైన ఆహారం అందేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలతో ఆయన భోజనం చేస్తూ ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా అని స్వయంగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు, అన్న క్యాంటీన్ నిర్వాహక సిబ్బంది, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.


దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

346వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి
న్యాయంగా తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 346వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఈదులమూడి శారమ్మా, వి.లక్ష్మీ, పి.మరియమ్మ, మొలక శారదా, దామవరపు సువర్ణకుమారి కూర్చున్నారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కె.స్టీవెన్, వై.సాంబశివరావు బి.అంకయ్య, తుపాకుల. నాగేశ్వరావు, షేక్ సుభాని, యహోషువ, డి.నాగేశ్వరావు, పిచ్చయ్య, మహిళలు రమాదేవి, ఇమాంబి, దుర్గాభవాని, నాగమల్లీశ్వరి పాల్గొన్నారు.

సమస్యలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా : చిల్లపల్లి

ప్రజాశక్తి - మంగళగిరి
ఎన్టీఆర్ జిల్లా గన్నవరం మండలం, సావరగూడెం గ్రామంలో ఉన్న ప్రధాన సమస్యలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలియజేయుటకు గ్రామస్థులు శుక్రవారం మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వచ్చారు. ఈ సందర్భంగా వారి నుంచి అర్జీను ఏపీ ఎం ఎస్ ఐ డి సి చైర్మన్ & జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు స్వీకరించారు. గ్రామ సమస్యలను తెలుసుకుని వారి గ్రామంలో ఉన్న సమస్యలను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

17 నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - పొన్నూరు
ఈనెల 17వ తేదీ నుండి పొన్నూరు పురపాలక సంఘంలోని 17 సచివాలయాల పరిధిలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయాల్లో ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు, అప్‌డేట్ తదితర సేవలు అందించబడునని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కమిషనర్‌గా శానిటరీ ఇన్‌స్పెక్టర్

ప్రజాశక్తి - పొన్నూరు
పొన్నూరు పురపాలక సంఘం శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాసరావుకు పలాస కమిషనర్‌గా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, అర్బన్ కార్పొరేషన్ డైరెక్టర్ వడ్రాణం మార్కండేయబాబు కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు సిబ్బంది ఆయనను సత్కరించారు.

రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్

ప్రజాశక్తి - తెనాలి
స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో శుక్రవారం సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో డమ్మీ బాంబు బ్లాస్ట్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో పేలుడు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణాపాయం లేకుండా బయటపడే విధానం తదితర అంశాలపై డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, వారిలో అవగాహన శక్తి అధికమని, వారికి సులభంగా అర్థమయ్యే రీతిలో డ్రిల్ నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సివిల్ డిఫెన్స్ అకాడమీ పోలీస్ అధికారులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు బాప్టిస్ట్ చర్చి వార్షికోత్సవం

కొలకలూరు తెలుగు బాప్టిస్ట్ చర్చ్ పదవ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ వల్లూరి వరప్రసాద్, సంఘం కార్యదర్శి రమేష్, కొలకలూరి నాగేశ్వరరావు అతిథులను సత్కరించారు.

మధుమేహంపై లలితా హాస్పిటల్‌లో అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ డయాబెటీస్ డే సందర్భంగా స్థానిక లలితా హాస్పిటల్ ప్రాంగణంలో మధుమేహంపై ఉచిత వైద్యశిబిరం, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ మాట్లాడుతూ ఈ ఏడాది డబ్ల్యూహెచ్ఓ 'మధుమేహం చిన్ననాటి నుండి వృద్ధాప్యం వరకూ 'అనే థీమ్ విడుదల చేసిందన్నారు. మధుమేహం జీవితంలోని అన్ని దశలనూ ప్రభావితం చేయగల వ్యాధి అని, మధుమేహంతో జీవించే ప్రతి ఒక్కరికీ సమగ్ర వైద్యసేవలు, సహాయక వాతావరణం, ఆరోగ్యం, గౌరవాన్ని, స్వీయ నిర్వహణను ప్రోత్సహించే పాలసీలు అందుబాటులో ఉండాలని డబ్ల్యూహెచ్ఓ తెలిపిందన్నారు. వైద్యశిబిరంలో ఉచితంగా షుగరు, రక్తపోటు పరీక్ష, బిఎంఐ పరీక్షలను దాదాపు 340 మందికి చేసినట్లు తెలిపారు. డయాబెటీస్ ఉన్న వారికి హార్ట్ ఎటాక్, బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదమే కాకుండా, కిడ్నీలు ఫెయిల్ అవటం, కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఏటా రిస్క్ ఫ్యాక్టర్ చెకప్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.విజయ, సీనియర్ డయాబెటాలజిస్టులు డాక్టర్ పద్మావతిదేవి, డాక్టర్ రామ్‌కుమార్, డాక్టర్ ఈదర కృష్ణమూర్తి, బి.వి.సుధీర్ వైద్యులు పాల్గొన్నారు.

రేపు అవాజ్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

అవాజ్ జిల్లా మహాసభ ఈనెల 16వ తేదీన బి.ఆర్.స్టేడియం వద్ద ఉన్న ఆవాజ్ జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు అవాజ్ నాయకులు తెలిపారు. శుక్రవారం బ్రాడీపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో మహాసభల పోస్టర్‌ను రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిష్టీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి భాషా మాట్లాడుతూ మహాసభలకు ముఖ్య అతిథిగా ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫోరం పూర్వ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం, మురుసం వ్యవస్థాపకులు ప్రముఖ కవి కరిముల్లా, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ చిస్తి, బ్రైట్ హారిజన్స్ ఫౌండేషన్ నాయకులు ఎం.కె.ఎస్.మొహిద్దీన్ పాల్గొంటారన్నారు. ఈ మహాసభలలో గత మూడు సంవత్సరాల కాలంలో ఆవాజ్ లౌకికవాద పరిరక్షణ కోసం, సంక్షేమ పథకాల అమలు కోసం ఆవాజ్ చేసిన కార్యక్రమాలను సమీక్షించుకొని, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు.


విద్యార్థులను అభినందిస్తున్న కాలేజి సెక్రెటరీ, ప్రిన్సిపాల్

ఐడియేషన్ ఛాలెంజ్‌లో ఆర్‌విఆర్ జెసి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రఖ్యాత యుకే సంస్థ ఫస్ట్ జెన్ నిర్వహి ంచిన జాతీయస్థాయి 'ఐడియేషన్ ఛాలెంజ్'లో తమ కళాశాల విద్యా ర్థులు ప్రతిభను చాటి అగ్రస్థానంలో నిలి చారని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజి నీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని ఒక ప్రకటనలో తెలిపారు.తమ కళాశాల నుండి పాల్గొన్న రెండు జట్లు సజనాత్మక ఆలోచనలతో విజేతలుగా నిలిచాయన్నారు. ఈసీఈ విభాగం నుండి పి. సాయిసృజన, సాయి ప్రజ్ఞ, వి.ఇందిరా ఈశ్వరి లక్ష్మి, ఎస్‌కెఎమ్ ప్యారిజాన్ 'ఎయిర్ పొల్యూషన్ కంట్రోల్-స్మార్ట్ సోలార్ పవర్' ఆవిష్కరణ ప్రదర్శించారన్నారు. సివిల్ విభాగం నుండి అప్పాజీ అరికపూడి 'స్మార్ట్ డ్రైనేజ్ సిస్టమ్' ఆవిష్కరణ ప్రదర్శించారన్నారు. రెండు జట్లకు రూ.10వేల చొప్పున నగదు బహుమతి అందజేశారన్నారు. శుక్రవారం కళాశాల సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.

నిర్వాసితులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న నళినీకాంత్

మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు 3వ దశ నిర్మాణంలో భాగంగా రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ కోరారు. శుక్రవారం బ్రాడీ పేటలోని పార్టీ కార్యాలయంలో బాధితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డు మూడో విడత రోడ్డు విస్తరణ సందర్భంగా సుమారు 300 ఇళ్లు తొలగించారని తెలిపారు. ఇళ్లు తొలగించినప్పుడు స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుగారు రోడ్డు విస్తరణలో ఇళ్ళు కోల్పోయిన బాధితులకు ప్రత్యామ్నాయంగా మూడు నెలల్లో ఇళ్ళు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చి ఏడు నెలలు అవుతున్నా, ఇంతవరకు పట్టించుకోకపోవడం దుర్మార్గమని విమర్శించారు. పేరేచర్లలోని పీఎం ఏవై-ఎన్టీఆర్ నగర్‌లో బాధిత కుటుంబాలందరూ ఒకే చోట ఉండే విధంగా తక్షణమే ఇళ్ళు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు ఆది నికల్సన్, నరసింహారావు పాల్గొన్నారు.

ఘనంగా బాలల పండుగ



న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వర్క్‌షాప్..



బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. సంస్థ కార్యదర్శి జియాఉద్దీన్ మాట్లాడుతూ బాల కార్మికులను గుర్తించి వారికి రక్షణ, పునరావాసం కల్పించటం, బడి మానేసిన పిల్లలను తిరిగి బడిలో చేర్పించటం వంటి కార్యక్రమాలను విజయవంతం చేయాలంటే న్యాయసేవాధికార సంస్థతోపాటు విద్య, కార్మిక, స్త్రీ, శిశు సంక్షేమశాఖ, పోలీసు శాఖలు కలిసి కట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. బాలల బంగారు భవిష్యత్ కోసం సమగ్ర ప్రణాళిక రూపొందించుకొని బాలల హక్కుల కోసం కృషి చేయాలన్నారు. క్రాఫ్ట్ సంస్థ బాలల హక్కుల గురించి రూపొం దించిన పోస్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఏఎల్ఓ 2 బి.కోటేశ్వరరావు, లీగల్ కం ప్రొబేషన్ ఆఫీసర్ వాసంతి, డీప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మధుబాబు, ప్యానల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

ఎంవిఎస్‌కె స్కూల్లో..

పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లోని ప్రొఫెసర్ ఎంవీఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ స్కూలులో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త, ఎన్నారై కొరటాల శేషగిరిరావు, హిందు కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ అబ్బరాజు రాజశేఖర్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందించారు శేషగిరిరావు మాట్లాడుతూ పిల్లలు కష్టపడే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని, చేసే పనిని ఇష్టపూర్వకంగా చేయాలని పట్టుదలతోనే విజయాలు సాధిం చగమని చెప్పారు. రాజశేఖర్ మాట్లాడుతూ పిల్లలు తమ అభిరుచులు అర్థం చేసుకొని వాటిని సాకారం చేసుకోవటానికి కృషి చేయా లన్నారు. కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపల్ ఎన్.తాండ వకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కె.దివ్య, అడ్మినిస్ట్రేటర్ ఎల్.ఎస్.భారవి పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..



స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య నగర్ ట్యూషన్ సెంటర్‌లో గుంటూరు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు ఎ.సుకన్య, ట్యూషన్ టీచర్ కె.సుజాత, ఎన్.పద్మ, ఎ.నికల్సన్ పాల్గొన్నారు.

సుమేధా హైస్కూల్లో బాలోత్సవం..



స్థానిక ఎన్‌జిఓ కాలనీలోని సుమేధ హైస్కూల్లో బాలోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 20 రోజుల నుండి సుమేధ బాలోత్సవ్ పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, బాల బాలికలకు స్పోర్ట్స్, లిటరరీ, కల్చరల్ మొదలగు 37 ఈవెంట్స్‌లో పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగంలో 3414 బహుమతులను అందచేశా మన్నారు. కార్యక్రమంలో మలినేని విద్యా సంస్థల చైర్మన్ పెరుమాళ్లు, బికె బిర్లా గ్రూప్ సిఇఓ జి.శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె..రాంబాబు ప్రసంగించారు.

గీతాంజలి హైస్కూల్లో ..



స్థానిక రామిరెడ్డి నగర్‌లోని గీతాంజలి హైస్కూల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ షేక్. హుస్సేన్ ముందుగా చాచా నెహ్రూ చిత్రపటనికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడుతూ దేశ మొదటగి ప్రధాని చాచా నెహ్రు అని, నెహ్రూకు పిల్లలంటే చాలా ఇష్టమని తెలిపారు. నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా నిర్వహించు కుంటున్నామని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్కూల్ హెచ్‌ఎం షేక్.షా శంషాబాద్ భాను, ఉపాధ్యాయులు శర్మ, సర్వని తదితరులు పాల్గొన్నారు.

జైన్ హైస్కూల్లో..



స్థానిక సంగడిగుంటలోని జైన్ హైస్కూల్లో బాలల దినోత్సవాన్ని సందడిగా నిర్వహించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ జాన్‌షైదా హాజరై మాట్లాడుతూ పిల్లల శారీరక, మానసిక వికాసానికి చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయ న్నారు. స్కూల్ డైరెక్టర్ ఎండి.మున్ను మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని, ప్రతి విద్యార్థిలోనూ అపారమైన ప్రతిభ నిక్షిప్తమై ఉంటుం దని, ఆ ప్రతిభను వెలికితీయడం, వారిని సమాజానికి ఉపయో గకరమైన వ్యక్తులు గా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల బాధ్యతన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.కనక దుర్గ, డాక్టర్ వాసుబాబు, మైనార్టీ నాయకులు ఎస్.ఎస్.పీ. జాదా పాల్గొన్నారు.

కన్న స్కూల్లో..



స్థానిక రైలుపేటలోని కన్న విద్యా సంస్థల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కన్న విద్యా సంస్థల అధినేత కన్న మాస్టారు మాట్లాడుతూ దేశం కోసం ఎంతో సేవ చేసిన నెహ్రూ భావాలు ప్రతి ఒక్కరికీ మార్గనిర్దేశనం కావాలన్నారు.సరైన వ విద్యతో మాత్రమే మెరుగైన సమాజాన్ని సాధించగలం అన్నారు. విద్యార్థులు అందరూ క్రమశిక్షణతో మెలగాలి అన్నారు. కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కెఎల్‌పి స్కూల్లో...



స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. స్కూల్ సెక్రెటరీ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రత్తయ్య, అకడమిక్ కోఆర్డినేటర్ బి.శైలజ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చిన్న అడుగులే పెద్ద ప్రయాణాలకు ప్రారంభం అని, విద్యార్థులు అందరూ నమ్మకంతో ముందుకు సాగాలని అన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. (ప్రజాశక్తి-గుంటూరు)



వారోత్సవాల్లో పాల్గొన్న కమిషనర్, కమిటీ సభ్యులు

గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (గార్డ్స్) నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు వారోత్సవాలను ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ పుస్తక పఠనానికి మించిన మంచి అలవాటు మరొకటి లేదన్నారు. తొలుత జవహర్లాల్ నెహ్రూ, అయ్యంకి వేంకట రమణయ్య, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తేళ్ల సుబ్బారావు, గార్డ్స్ అధ్యక్షురాలు దాసరి ధనలక్ష్మీ గ్రంథాలయాభివృద్ధి కమిటీ సభ్యులు కె.శివరావు, జి.నారాయణ, టి.ప్రతాపరెడ్డి మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ డి.చిట్టిబాబు, గ్రంథాలయాభివృద్ధి కమిటీ కార్యదర్శి దార్ల బుజ్జిబాబు, గ్రంథాలయ ఇంచార్జ్ అధికారి డి.వీర్రాజు సిబ్బంది సరోజినీ, అచ్చమ్మ, సలోమి, సాంబిరెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట శాఖా గ్రంథాలయం మురికిపూడిలో నిర్వహించిన గ్రంథాలయ దినోత్సవంలో ముఖ్యఅతిథిగా గ్రామపెద్దలు చెన్నుపాటి నాగరాజు, ప్రధానోపాధ్యాయులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డి. ధనలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి, మురికిపూడి పంచాయతీ కె.ప్రభుదాస్ పాల్గొన్నారు. ముందుగా చెన్నుపా టి.నాగరాజు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు గ్రంథాలయ ఇంచార్జ్ అధికారి మాచర్ల మెర్సీ అధ్యక్షత వహించారు. జి.కిరీట్ రెడ్డి, ఎం. సుందరావు, ఎం.వాసు, అయోషాసుల్తాన్ బేగం, ఓరుగంటి చెన్నకేశవరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి -పెదకూరపాడు

స్థానిక లైబ్రరీలో గ్రంథాలయ వారోత్సవాల భాగంగా బాలల దినోత్సవ వేడుకలు లైబ్రేరియన్ మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల విద్యా శాఖ అధికారి-2 తాడిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలని ఉపాధ్యాయులు శీలంనేని సాంబశివరావు, ఆర్. సాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంపీడీవో ఏ ఉమాదేవి అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు శాఖ



మాచర్లలో ... మాట్లాడుతున్న షేక్ మదార్ సాహెబ్

గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలు చేసి నివాళులర్పించారు గ్రంథాలయ నిర్వాహకులు గంటా శ్రీనివాసరావు, ఎస్ నాగలక్ష్మి, ఏవో శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు ఎం.నాగేశ్వరరావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండలంలోని రొంపిచర్ల, సంతగుడిపాడు గ్రామాల్లోని శాఖా గ్రంథాలయాల్లో ఎంఇఓ డి.బ్రహ్మేశ్వర రావు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్య క్రమంలో ఆయా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.యం. సుభానీ, కె.శ్రీనివాసరావు, సంతగుడిపాడు కెజిబివి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలశౌరీలు, ఆయా శాఖల గ్రంథాలయాధికార్లు కె. రమణారెడ్డి, ఎం.నాగుల్ మీరావలి, ఉపాధ్యా యులు, విద్యార్థులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

సమిష్టి కృషితోనే సుపరిపాలన

ప్రభుత్వ చీఫ్ విప్ జీవి

ప్రజాశక్తి - వినుకొండ

ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి సమిష్టిగా పనిచేస్తేనే సుపరిపాలన సాధ్యమవుతుందని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో శావల్యాపురం మండల ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి మండల అధికారులు, గ్రామస్థాయిలో ఉద్యోగులు సిబ్బంది సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రాష్ట్రంలో కూటమి ప్రభు త్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులందరికీ చేరువచేయాలని కోరారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను, గ్రామస్థాయి నాయకులు, ప్రజాప్రతి నిధులు, ప్రజలు తీసుకురాగానే అధికారులు స్పందించి సత్వ రమే పరిష్కరించాలని ఆదేశించారు. ఇంటి స్థలం, ఇల్లు లేని అర్హులైన పేదల చేత దరఖాస్తులు పెట్టించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికి తీసుకువెళ్లాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు జాప్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

ఘన వ్యర్థ నిర్వహణపై శిక్షణా కార్యక్రమం

ప్రజాశక్తి- చిలకలూరిపేట

పురపాలక సంఘ కౌన్సిల్ హాల్లో శుక్రవారం ఘన వ్యర్థ నిర్వహణపై సామర్థ్యవృద్ధి శిక్షణా కార్యక్రమం నిర్వహిం చారు. ఏఐఐఎల్ఎస్‌జి. విజయవాడ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొ రేషన్ సంయుక్తంగా మెప్మా ఆర్పిల కోసం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చ్కెర్మన్ షేక్ రఫ్ఫాని హాజరై మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు అవసరమైన అవగాహన, నైపుణ్యాలను పెంపొందించడం శిక్షణా కార్యక్రమం ప్రధాన లక్ష్య మన్నారు. చిలకలూరిపేట మున్సిపాలిటీ చైర్మన్‌షేక్ రఫ్ఫాని పట్టణాన్ని అధికారికంగా 'ప్లాస్టిక్ ఫ్రీజోన్'గా ప్రకటించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే దిశగా, ఏఐ ఐఎల్ఎస్‌జి సంస్థ తరపున మున్సిపల్ కమిషనర్, చైర్మన్, సిబ్బందికి స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

10682 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి

ప్రజాశక్తి - రెంటచింతల

సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో గురువారం అర్ధరాత్రి 12 గంటల వరకు 10682 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. ఎగువన సాగర్ నుంచి నీళ్లు రాకపోవడం వలన 20 రేడియల్ క్రస్ట్ గేట్లన్నీ మూసివేశామన్నారు. రిజర్వాయర్లో 74.13 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 61660 టీఎంసీలకు సమానమన్నారు.



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ రఫాని

పారిశుధ్య పనులు తనిఖీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని పారిశుధ్య పనులను శుక్రవారం మున్సి పల్ ఛైర్మన్ షేక్ రఫాని పరిశీలించారు. పట్టణంలోని పలు కాలనీలు, వార్డులలో పండరీపురం, శారద హైస్కూల్ రోడ్డు, పెద నందిపాడు రోడ్డు, వేలూరు రోడ్డు, సి.ఆర్.కాలనీ మెయిన్ రోడ్డు, ప్రధాన సెంటర్లలో పారిశుధ్య స్థితిని పరిశీలించారు. పట్టణంలో పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ప్రజారోగ్య భద్రత దృష్ట్యా శుభ్రత పనులను నిరంతరంగా కొనసాగించాలంటూ అధికారులకు సూచించారు.



ప్రమాణం చేయిస్తున్న ఆంజనేయులు, వర్ల రామయ్య

కార్యకర్తలే టీడీపీకి మూల స్తంభాలు

ప్రజాశక్తి - వినుకొండ

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే మూల స్తంభాలని, కార్యకర్తలకు అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని ప్రభుత్వ చీఫ్‌విప్, జీవి ఆంజనేయులు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. స్థానిక గంగినేని కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన వినుకొండ నియోజకవర్గంలోని పట్టణ, మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ స్థాయిల నూతన కమిటీ బాధ్యుల ప్రమాణ స్వీకారంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వర్లరామయ్య మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనను తరిమికొట్టడంలోకార్యకర్తల పాత్ర మరువలేనిదన్నారు. ఆంజనేయులు మాట్లాడుతూ అధికారం శాశ్వతం కాదని, ఐదేళ్ల వైసిపి పాలనలో రౌడీయిజంతో అనేక అరాచకాలకు పాల్పడితే ప్రజలు సరైన రీతిలో బుద్ధి చెప్పారని అన్నారు. ముందుగా ఎన్టీరామా రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిడి సిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి మానుకొండ వరప్రసాద్, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ యార్డు చైర్మన్లు, నీటిసంఘాల అధ్యక్షులు, సొసైటీ ప్రెసిడెంట్లు పాల్గొన్నారు

దేశానికి దిక్సూచి జవహర్లాల్ నెహ్రూ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్వతంత్ర భారతదేశ ఆర్థిక నావకు దిక్సూచి పండిట్ జవహర్‌లాల్ నెహూ దేశ చరిత్రలో చిరస్మరణీయమైన స్థానాన్ని కలిగి ఉంటారని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమ న్వయకర్త ఎం.రాధాకష్ణ శుక్రవారం అన్నారు. జవహర్లాల్ నెహ్రూ 136వ జయంతి కార్యక్రమానికి పలనాడు జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇంటూరి భవానీ వెంక టేష్ అధ్యక్షతన స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాల నిర్వహించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయరంగం వెన్నెముకని గుర్తించి కావలసిన మౌలిక వసతులు కల్పించడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పారిశ్రామికాభివృద్ధికి బాటలు వేసిన నేత నెహ్రూ అన్నారు. రాష్ట్ర బాల రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ దార్ల బుజ్జి బాబు, రైజ్ సంస్థ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శ్రీరామ్‌రెడ్డి, సీనియర్‌కాంగ్రెస్ నాయ కుడు బొడ్లపాటి రామకోటేశ్వరరావు, బొడ్డపాటి రామ కోటే శ్వరరావు చేరెడ్డి శ్రీరామరెడ్డి సాగి మల్లికార్జునరావు నందిగం సాంబయ్య పూలమాలలు వేసినివాళులర్పించారు. కాంగ్రెస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి యు.అనిల్‌కుమార్ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ నస్రుద్దీన్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడుచే రెడ్డి శ్రీరామ్‌రెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు సాగిమల్లికార్జునరావు రెడ్డెం నర్సిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బి.రామకోటేశ్వరరావు కేతావత్ బీమానాయక్, ఆంజనేయులు షేక్‌మునీబాజీ పి.ఎలిజిబెత్‌రాణి



నెహ్రూకు నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

అమరావతిలో గ్రంథాలయంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త జాజిబాబు నెహ్రూకి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదువుకోవాలన్నారు గంథాలయ ఇన్చార్జి వెంకాయమ్మ మాట్లాడుతూ రోజు గ్రంథాలయానికి గ్రామపెద్దలు హాజరవ్వాలని వారు కోరారు అనంతరం గ్రంథాలయం నుండి ర్యాలీ నిర్వహించారు. టి.ప్రదీప్ ప్రశాంత స్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని గారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శివనాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు కబడ్డీ, మ్యూజికల్ చైర్స్, రన్నింగ్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. విజేతలకు మహనీయుల జీవిత చరిత్రల పుస్తకాలు బహుమతిగా మాగులూరి ఫౌండేషన్ అందజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

డాక్టర్ కంచర్ల సాంబశివరావు మృతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట


పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, నాగభూషణం మెమోరియల్ నర్సింగ్ హోమ్‌అధినేత డాక్టర్ కంచర్ల సాంబశివరావు శుక్రవారం ఆయన గృహంలో మృతి చెందారు. ఆయన మృతి పట్ల శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు, పండరీపురం 1వ లైన్‌లోని వారి స్వగృహం వద్ద పార్థివదేహాన్ని సందర్శించి, నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు అనంతరం మాట్లాడుతూ చిలకలూరిపేట పట్టణంలో 40ఏళ్లుగా నాగభూషణం మెమోరి యల్ నర్సింగ్ హోం ద్వారా వేలాది మందికి వైద్యసేవలు అందిం చారని, నియోజకవర్గ ప్రజలతో పాటు పక్క జిల్లాల వారికి అతి తక్కువ ఖర్చుతో వైద్యం చేస్తూ, ప్రజల వద్ద పేరు తెచ్చుకున్నారని, ఆయన మృతి వైద్యరంగానికి తీరనిలోటని అన్నారు.

హ్యూమన్ రైట్స్ నూతన కమిటీ నియామకం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గుంటూరులోని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో తొమ్మిది మంది సభ్యులతో పల్నాడు జిల్లా కమిటీని ఏర్పాటయింది. నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ పల్నాడు జిల్లా చైర్మన్‌గా తుమ్మూరు శ్రీనివాసరెడ్డి నియామకం కాగా జిల్లా ఉపాధ్యక్షులుగా పొనుగోటి వీరాంజనేయులు, షేక్ మస్తాన్ వలీ, మీడియా కోఆర్డినేటర్ గా జిర్రా వెంకట సాంబశివారెడ్డి, జనరల్ సెక్రెటరీగా ఎర్రం రెడ్డి నాగేశ్వర రెడ్డి, లీగల్ అడ్వైజర్ గా శనివారపు మురళీకష్ణ రెడ్డి, మహిళ కోఆర్డినేటర్‌గా నీలం పద్మావతి, సయ్యద్ అల్లాబీ, సంయుక్త కార్యదర్శులుగా కొవ్వూరి వెంకట సుబ్బారావు, మట్టా పూర్ణ చంద్రరావు నియమితులయ్యారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్‌శ్యామల కోటిరెడ్డి, జిల్లా చైర్మన్ తుమ్మూరు శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీని రాష్ట్ర నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ మెంబర్ భవనం పుల్లారెడ్డి అభినందించారు.

ఘనంగా జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు ప్రారంభం



నేటి యువత నెహ్రూను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి- తాడేపల్లి

భారత మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతి వేడుకలు శుక్రవారం తాడేపల్లి పట్టణం లోనినెహ్రూ బొమ్మ సెంటర్ లో కాంగ్రెస్ పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు దర్శనపు శ్యామ్యూల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జి షేక్ సలీం పాల్గొని నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం అనంతరం సుదీర్ఘకాలం ప్రధానమంత్రిగా పనిచేసి పంచవర్ష ప్రణాళికలను తీసుకువచ్చి దేశ అభివృద్ధిలో నెహ్రు కీలకపాత్ర వహించారని అన్నారు. శాంతియుత పాలన అందించడంలో నెహ్రూ ముందున్నారని నేటి యువతకు ఆయన ఆదర్శమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు షేక్ మున్ని,జిల్లా కాపుసాధికారిక చైర్మన్ రేమిడిశెట్టి హనుమంతరావు, మంగళగిరి మండల అధ్యక్షులు కుప్పాల కృష్ణ చౌదరి,నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు ఆర్ల వెంకటస్వామి, జిల్లా ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ బొల్లా సమర్పణ కుమార్, తాడి కొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యాసరచనలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలం లోని పుసులూరు జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఇటీవల అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మొదటి మరియు రెండో బహుమతులను గెలుచుకున్న విద్యార్థినులకు, ఐసిడిఎస్ ప్రత్తిపాడు వారి ఆధ్వర్యంలో శుక్రవారం చిల్డ్రన్స్ డే సందర్భంగా బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి పి ఆశ, రెండవ బహుమతి ఎస్ చైతన్య లకు హైస్కూల్ హెచ్ఎం కె వెంకటేశ్వర్ రావు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏ సుహాసిని, ఎస్ చెంచుబాబు, ఏ రాజశేఖర్, టి శ్రీనివాసరావు, వై శ్రీనివాస్ రావు మరియు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి చేబ్రోలు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సహకారం ప్రోత్సాకరం అభినందనీయం ప్రధానోపాధ్యాయులు ఎం ఏడుకొండలు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారాకోడూరు లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వెలగ గోపినాథ్ కమిటీ మెంబర్ పి భాస్కరరావు పూర్వ విద్యార్థులు 2001 ఎస్ఎస్ సి బ్యాచ్ పూర్వ విద్యార్థులు శ్రీకృష్ణ కాంత్ ఆవుల జగన్మోహన్, కత్తుల వెంకటేష్ పాల్గొన్నారు. సమావేశానికి ప్రధానోపాధ్యాయులు ఎం ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దేశ ప్రథమ ప్రధాని పండిట్ నెహ్రూ కి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు . సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఎస్ పిచ్చమ్మ బాలల దినోత్సవ ప్రాముఖ్యత నవభారత నిర్మాణానికి నెహ్రూ చేసినటువంటి సేవలు గురించి తెలియజేశారు. విద్యార్థులకు పూర్వ విద్యార్థులు 2001 బ్యాచ్ సహకారంతో రాష్ట్ర స్థాయిలో హ్యాండ్ బాల్ క్రీడల్లో నైపుణ్యము ప్రదర్శించిన క్రీడాకారులకు బహుమతులు అందజేయడం జరిగింది. పాఠశాల తరపున చెకుముకి సైన్స్ క్విజ్ లో కౌశల్ ఎగ్జామ్ లో కాన్స్టిట్యూషన్ డే పోటీ పరీక్షలో మండల స్థాయిలో జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన విజేతలకు కమిటీ చైర్మన్ వెలగ గోపినాథ్ బహుమతులు అందజేయడం జరిగింది కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరాస్వామి అరుణ జ్యోతి డివి శ్రీనివాస్ ఉమా అనల కుమారి అనల కుమారి విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లూరులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర

ప్రజా శక్తి పెదకూరపాడు

మండలంలోని తాళ్లూరులో శనివారం స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జరుగుతుందని ఎండిఓ సాయి లీల తెలిపారు. మండల అధికారులు అందరూ కూడా ఉదయం 10.00 గంటలకు 75 తాళ్లూరు హాజరు కావలసినది కోరారు. ప్రతినెల మూడవ శనివారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.



ప్రజాశక్తి- తాడేపల్లి

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం తాడేపల్లి శాఖ గ్రంథాలయంలో భారత ప్రథమ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ జన్మదిన సందర్భంగా ప్రారంభమయ్యాయి. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు గన్ని శ్రీనివాస విశ్వనాథ మాట్లాడారు. ప్రతి విద్యార్థి తమ జీవితంలో ఏదో ఒక రోజు, ఏదో ఒక క్షణం తప్పనిసరిగా గ్రంథాలయానికి వస్తారన్నారు. దీనివల్ల జ్ఞాన సమపార్జన పెరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా జూనియర్స్ విభాగంలో విద్యార్థిని విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.న్యాయ నిర్ణీతగా గన్నే శ్రీనివాస విశ్వనాథన్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్ శ్రీలత, టి జే శారద పాల్గొన్నారు.

ప్రజాశక్తి తెనాలి : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను సబ్ కలెక్టర్ సంజన సింహ శుక్రవారం ప్రారంభించారు స్థానిక కొత్తపేటలోని బాలల గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థుల నుద్దేశించి సబ్ కలెక్టర్ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విజ్ఞానాన్ని పొందాలంటే తరగతి పుస్తకాలతో పాటు గ్రంథాలయ పుస్తకాలు చదవడం ప్రతీ ఒక్కరు దినచర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వి ప్రియాంక, గ్రంథాలయాధికారిణి కె సుజాత, లక్కరాజు సాయి, ఎ బాలచంద్రమౌళి, సిహెచ్ శ్రీదేవి, వి నాగేంద్రం, ఎ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి దుగ్గిరాల : మండల కేంద్రం దుగ్గిరాలలోని గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షలకు అవసరమైతే విజ్ఞానం గ్రంథాలయాల్లో లభిస్తుందన్నారు. మొబైల్ కు దూరంగా ఉండి పుస్తకాలకు సమయం కేటాయించాలని కార్యక్రమానికి హాజరైన విద్యార్థిని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో దోస్త్ అధ్యక్షులు మిక్కిలినేని గాంధీ ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ వి చంద్రమోహన్ లైబ్రేరియన్ బి జ్యోతి స్థానికులు గద్దె రవీంద్ర కొత్త సుబ్రహ్మణ్యం జంపాల సాంగ్స్ బి లలితానంద ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పారిశ్రామికవేత్త ముద్దన రాఘవయ్య, గ్రామం టిడిపి అధ్యక్షులు రావి శివరామకృష్ణయ్య జవహర్లాల్ నెహ్రూ విగ్రహానికి పూలమాల లు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానభాండాగారాలని విద్యార్థులు తరచూ గ్రంథాలయాలలో పుస్తక పఠనం చేయడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని. ఎంతోమంది పేద విద్యార్థులు గ్రంథాలయాలలోని దినపత్రికలు పుస్తకాలు ప్రతిరోజు చదువుకొని ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలు సంపాదించిన ఘనత ఉందన్నారు. విద్యార్థులు వారిని స్ఫూర్తిగా తీసుకొని కష్టపడి ఇష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కార్యక్రమం లో గ్రంథాలయ అధికారి డి. శివనాగేశ్వరరావు, వి. శివయ్య, మంజుల పాల్గొన్నారు. :



ప్రజాశక్తి తెనాలి

స్థానిక నెహ్రూ రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ జె రామఅప్పల నాయుడు, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం పాల్గొని వారోత్సవాలను ప్రారంభించారు. తొలుత జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు గ్రంథాలయ వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలన్నారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గ్రంథాలయ అధికారి పూర్ణచంద్రరావు విద్యార్థులకు నిర్వహించే పోటీలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ లావణ్య సుధ, సహజ కవి అయినాల మల్లేశ్వరరావు, పి శ్రీనివాసరావు, ఎం రమణయ్య, ఎసిపి వాణి పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవములో భాగంగా శుక్రవారం మంగళగిరి శాఖా గ్రంథాలయంలో బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. సందర్భంగా జవహర్లాల్ నెహ్రూ, అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. సీకే జూనియర్ కాలేజీ లెక్చరర్ ఎన్ ఆనందరావు మాట్లాడుతూ నేటి బాలలే దేశాన్ని ప్రగతి పదములో నడిపిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో



గ్రంథాలయ అధికారి నంబూరు ఆరోగ్యం, కష్ణ, గ్రంథాలయ సిబ్బంది, వార్డ్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నరసరావుపేట

బాలల దినోత్సవం సందర్భంగా నరసరావుపేట శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అధితులుగా నరసరావుపేట శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, సహాయక కార్మిక కమిషనర్ మహబూబ్ సుభాని, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ కె. ఎస్. రామ్ ప్రసాద్, దుగ్గింపూడి వీరయ్య చౌదరి, అభ్యుదయ భారతి అధ్యక్షులు రత్నాకరం రాము పాల్గొన్నారు. ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు జవహర్ లాల్ నెహ్రూ మరియు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం మరియు గ్రంథాలయాల ఆవశ్యకతను పిల్లలకు వివరించారు. గ్రంథాలయాలను అందరూ ఉపయోగించుకోవాలని గ్రంథాలయాల్లో పురాతన గ్రంధాలు అందుబాటులో ఉంటాయని చరిత్ర గురించి మనకు లభ్యమయ్యే చోటు ఒక గ్రంథాలయం తప్ప మరెక్కడా ఉండదని అన్నారు. వీలైనప్పుడల్లా గ్రంథాలయాన్ని సందర్శించాలని తద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలియచేసారు. మహబూబ్ సుభాని మాట్లాడుతూ నేటి తరానికి డిజిటల్ లైబ్రరీలు ఎంతో ముఖ్యమని తెలిపారు. పుస్తకాలతో పాటు డిజిటల్ లైబ్రరీస్ ఆవశ్యకతను వివరించారు. రాంప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు అనునిత్యం గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని వారి భవిష్యత్ మరియు సమాజ అభివద్ధి కొరకు పాటుపడాలని నేటి బాలలే రేపటి పౌరులని అన్నారు. వీరయ్య చౌదరి మాట్లాడుతూ అక్షర సమాజం పుట్టిన నాటి నుండి గ్రంధాలు జీవన వికాసానికి, సామాజిక పురోగతికి సోపానాలుగా నిలిచాయని అన్నారు. గ్రంథాలయాధికారిణి యడ్లపాటి రాధ మాట్లాడుతూ గ్రంథాలయాలు అందిస్తున్న సేవలను ప్రజలకు తెలియచేయడం, నేటి తరాలను గ్రంథాలయాలకు సన్నిహితం చేయడమే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ వారి సహకారంతో, గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నరసరావుపేట శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 15 వ తారీకున పుస్తక ప్రదర్శన మరియు వ్యాసరచన పోటీలు ఉంటాయని తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు మరియు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజధాని రైతుల సమస్యలపై సిఆర్‌డిఎ బాధ్యతారాహిత్యం : సిపిఐ

ప్రజాశక్తి - తుళ్లూరు



మాట్లాడుతున్న సిపిఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు

రాజధాని రైతుల సమస్యల పరిష్కారంలో సిఆర్‌డిఎ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. సిపిఐ శత జయంతోత్సావాల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేసే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాజధాని ప్రాంతం,తుళ్లూరులో జరిగిన కార్యకర్తల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ, రాజధానిలో మూడు వేలమంది రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు వీధిపోట్లు సమస్య ఉందని, సి ఆర్ డి ఎ అధికారుల వద్దకు ఏళ్ల తరబడి తిరిగినా ప్రయోజనం లేకుండా పోతోందని అన్నారు. కొంతమందికి ప్లాట్లను ల్యాండ్ పూలింగ్ కు ఇవ్వని భూముల్లో ఇచ్చారని, సరిజేయమని రైతులు మొత్తుకుంటున్నా, మంత్రులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతుందని మండిపడ్డారు. బోరుపాలెం, అబ్బరాజుపాలెం, రాయపూడిలో నిమ్మ, అరటి తదితర పంటలకు జరీబు ప్యాకేజి ఇచ్చి అర్థాంతరంగా నిలిపివేశారని, తరువాత వాటిని మెట్ట భూములుగా చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పొరపాట్లు సరిదిద్దడానికి కేబినెట్ మీటింగ్ పెట్టాలా.. అని ముప్పాళ్ల ఎద్దేవా చేశారు. సిఆర్‌డిఎ అధికారుల నిర్లక్ష్యంపై ముఖ్యమంత్రి, డిప్యూటీ సిఎం, మంత్రి లోకేష్ ఎందుకు మాట్లాడరని నిలదీశారు.సి ఆర్ డి ఎ అధికారుల వైఖరి పట్ల రాజధాని రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు.సి ఆర్ డి ఎ కార్యాలయం అవినీతిమయమైందని ప్రతి రైతు చెబుతున్నాడని,డబ్బులు ముట్టజెపితే నచ్చినచోట ప్లాట్లు కేటాయిస్తున్నారని వస్తున్న ఆరోపణలపై ప్రశ్నించేందుకు వచ్చిన పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలన్నారు. రైతులు,మహిళలు ఉద్యమం తో రాజధానిని కాపాడుకుంటే టిడిపి కూటమి ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను పట్టించుకోకుండా అదానీ, అంబానీ, బడా కంపెనీలకు ఎడాపెడా భూములు కేటాయిస్తోందన్నారు. రైతులను కలిసేందుకు మంత్రి నారాయణకు సమయం దొరకడం లేదని, రైతులు 14 అంశాలతో వినతిపత్రం ఇస్తే చేసిన పనికి సంబంధించిన వివరాలను ప్రతినెలా తెలుపుతామని చెప్పి మూడు నెలలు గడిచినా అతీగతీ లేదన్నారు .ప్రతి ఏటా రైతులకు కౌలు పెంచిన విధంగా భూమిలేని వారికి కూడా అమరావతి సామాజిక ఫించన్ పెంచాలని డిమాండ్ చేశారు.రాజధాని వాసులకు ఉపాధి,రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి,ఎం శివశంకరరావు, కాబోతు ఈశ్వరరావు, గుర్రంకొండ సత్యానందం,తోకల అనురాధ పాల్గన్నారు.